RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 107 | మే 09 శనివారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 107 | May 09 Saturday 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |

## 2లక్షల రుణమాఫీ చూపించండి

లేకుంటే రాజకీయ సన్యాసం తీసుకోండి

పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్‌కు వేముల సవాల్ 2

# పాలనలో వేగం, పారదర్శకత పెంచడమే లక్ష్యం

### కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక దిశానిర్దేశం

**అమరావతి గరుడధాత్రి**

పాలనలో వేగం, పారదర్శకత పెంచడమే లక్ష్యంగా రెండోరోజు కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు అందడంలో 'స్పీడ్ ఆఫ్ డెలివరీ' అత్యంత ప్రధానమని, ఫైళ్ల క్లియరెన్స్ కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి మండల స్థాయి వరకు ప్రతి అధికారి ఫైళ్లను పరిష్కరించడంలో వేగం పెంచాలని, మాన్యువల్ ఫైలింగ్ విధానాన్ని పూర్తిగా పక్కన పెట్టి వంద శాతం ఆన్‌లైన్ విధానాన్ని అమలు చేయాలని ఆదేశించారు. టెక్నాలజీని అందిపుచ్చుకుని పాలనను సులభతరం చేయడంతో పాటు, 24 గంటల్లోపు ఈ-ఫైల్స్ పరిష్కారమయ్యేలా మంత్రులు, ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ క్రమంలో నిర్ణీత సమయంలోగా ఫైళ్లను క్లియర్ చేస్తున్న సిఎస్ సాయి ప్రసాద్‌తో పాటు పలువురు మంత్రులు, అధికారులను సీఎం అభినందించారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఇప్పటికే 90 శాతం ప్రభుత్వ సేవలను పౌరులకు చేరువ చేశామని, డిసెంబర్ నాటికి అన్ని సేవలను ఇందులోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి లక్ష్యాన్ని నిర్దేశించారు.

➢ మిగతా 2వ పేజీలో..



## కిడ్నీ బాధితులకు మెరుగైన వైద్య సేవలు

- 12 డయాలసిస్ కేంద్రాల ఏర్పాటు
- ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



**అమరావతి గరుడధాత్రి**

రాష్ట్రంలోని కిడ్నీ బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అమరావతిలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా మరో 12 డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రైవేట్ ఏజెన్సీలకు టెండర్ల ద్వారా వీటి నిర్వహణ బాధ్యతలను అప్పగించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 12 కేంద్రాలను అందుబాటులోకి తెచ్చామని, ఇప్పుడు రాబోయే అదనపు కేంద్రాలతో కలిపి రాష్ట్రంలో మొత్తం డయాలసిస్ కేంద్రాల సంఖ్య 73కి చేరుతుందని మంత్రి వివరించారు.

# 'సోనార్ బంగ్లా' కలల సాకారం

### కేంద్ర హోంమంత్రి అమిత్ షా




**కలకత్తా గరుడధాత్రి**

పశ్చిమ బెంగాల్‌లో 'సోనార్ బంగ్లా' కలల సాకారానికి కొత్తగా కొలువుదీరనున్న భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం అంకితభావంతో పనిచేస్తుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఉద్ఘాటించారు. కోల్‌కతాలో శుక్రవారం జరిగిన బీజేపీ లెజిస్లేచర్ పార్టీ భేటీలో ఆయన మాట్లాడుతూ.. తృణమూల్ కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీల కబంధ హస్తాల నుంచి బెంగాల్‌ను విముక్తం చేస్తూ బీజేపీకి పట్టం కట్టిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ శాసనసభాపక్ష నేతగా సువేందు అధికారి పేరును అమిత్ షా అధికారికంగా ప్రకటించడమే కాకుండా, ఆయన్ను 'కాబోయే ముఖ్యమంత్రి'గా అభివర్ణించారు. దశాబ్దాలుగా బెంగాల్‌ను పట్టిపీడిస్తున్న భయం, హింసాత్మక రాజకీయాలకు స్వస్తి పలికి, రవీంద్రనాథ్ ఠాగూర్ కలలుగన్న ఆత్మగౌరవంతో కూడిన సమాజాన్ని నిర్మిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ముఖ్యంగా రాష్ట్రంలో అశాంతికి కారణమవుతున్న చొరబాటుదారులను పూర్తిగా తరిమికొడతామని, గోవుల అక్రమ రవాణాకు కళ్లెం వేస్తామని స్పష్టం చేశారు. సరిహద్దుల్లో నిఘాను మరింత కట్టుదిట్టం చేసి దేశ రక్షణకు ప్రాధాన్యత ఇస్తామని, త్రిపుర, అస్సాం, బెంగాల్‌లలో బీజేపీ ప్రభుత్వాలు ఉండటం వల్ల అక్రమ రవాణా అణిచివేత సులభతరం అవుతుందని అమిత్ షా పేర్కొన్నారు. గడిచిన 50 ఏళ్లలో బెంగాల్ ఆర్థిక వ్యవస్థ, ప్రజాస్వామ్యం తీవ్రంగా దెబ్బతిన్నాయని, ప్రధాని మోదీ ఇచ్చిన హామీల మేరకు రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద వంటి మహనీయుల ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతామని చెప్పారు.

# సచివాలయంపై డ్రోన్ కలకలం

**అమరావతి గరుడధాత్రి**

రాజధాని అమరావతిలో అత్యంత ప్రతిష్టాత్మకమైన కలెక్టర్ల సదస్సు జరుగుతున్న వేళ, సచివాలయంపై డ్రోన్ తిరుగుతోందంటూ సామాజిక మాధ్యమాల్లో జరిగిన ప్రచారం తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత గంభీరంగా పరిగణించడమే కాకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా తప్పుడు వార్తలను వ్యాప్తి చేయడం వెనుక ఉన్న కుట్ర కోణాన్ని దర్యాప్తు చేయాలని భావిస్తోంది. విజయవాడలోని సచివాలయంలో కీలక సమావేశాలు జరుగుతున్న తరుణంలో, ఆకాశంలో కనిపించిన ఒక విమానాన్ని డ్రోన్‌గా చిత్రీకరిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి భద్రతా వైఫల్యం జరిగిందని విమర్శలు గుప్పించారు. అయితే రంగంలోకి దిగిన పోలీసులు పూర్తిస్థాయి విచారణ చేపట్టగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఢిల్లీ నుండి విజయవాడకు వస్తున్న ఞ×2903 విమానం నిర్ణీత షెడ్యూల్ ప్రకారం ల్యాండింగ్ కావడానికి ఆ మార్గంలో ప్రయాణించిందని, దానినే కొందరు కావాలని డ్రోన్‌గా తప్పుడు ప్రచారం చేశారని అధికారులు నిర్ధారించారు. విమానాన్ని డ్రోన్‌గా చూపిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించేలా ప్రవర్తించిన వారిపై సర్కార్ కఠినంగా వ్యవహరించనుంది.

# ఇండి కూటమికీ బీటలు

## వైదొలుగుతున్నట్టు డీఎంకే ప్రకటన

**చెన్నై గరుడధాత్రి**

తమిళనాడు రాజకీయాల్లో పెను మార్పులు సంభవిస్తూ, జాతీయ స్థాయిలో ప్రతిపక్షాల 'ఇండీ' కూటమికి భారీ షాక్ తగిలింది. రాష్ట్రంలో విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీకి కాంగ్రెస్ మద్దతు ప్రకటించడాన్ని నిరసిస్తూ, డీఎంకే కూటమి నుంచి అధికారికంగా వైదొలిగింది. కాంగ్రెస్‌తో తమ దశాబ్దాల పొత్తు ముగిసినట్లేనని ప్రకటించిన డీఎంకే, లోక్‌సభలో తమ పార్టీ ఎంపీలకు ప్రత్యేక సీట్లు కేటాయించాలని కోరుతూ స్పీకర్‌కు లేఖ రాసింది. ముఖ్యంగా కాంగ్రెస్ ఎంపీల పక్కన కూర్చోవడానికి తమకు ఇష్టం లేదని డీఎంకే



జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
09 శనివారం, మే 2026

# నది ప్రక్షాళన మాత్రమే కాదు..

## అది ఒక సామాజిక బాధ్యత

**మొదటిపేజీ తరువాయి..** దశల్లో 55 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేయాలని నిర్ణయించగా, మొదటి దశ పనులను సుమారు రూ. 7,055 కోట్ల వ్యయంతో చేపట్టనున్నారు. దీని కోసం ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఏడీబీ) నుంచి నిధుల సేకరణకు సంబంధించిన చర్చలు విజయవంతమయ్యాయని అధికారులు వెల్లడించారు. హిమాయత్ సాగర్ మరియు ఉస్మాన్ సాగర్ నుంచి బాపుఘాట్ వరకు ఉన్న మొదటి 21 కిలోమీటర్ల పరిధిలో, ఎటువంటి ఆటంకాలు లేని తొలి ఐదు కిలోమీటర్ల పనులను వెంటనే ప్రారంభించాలని మంత్రులు ఆదేశించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా నదిని శుభ్రపరచడం, వరద నియంత్రణకు రిటైనింగ్ వాల్స్, నదికి ఇరువైపులా రోడ్లు, మురుగునీటి కాలువలు, బ్యారేజీలు మరియు రివర్ ఫ్రంట్ అభివృద్ధి వంటి పనులు చేపట్టనున్నారు. అలాగే నార్సింగి నుంచి గౌరెల్లి వరకు 55 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సంబంధించిన డీపీఆర్ సిద్ధమవుతోంది.
పర్యావరణ అనుమతులు పొందుతూనే, ప్రాజెక్టు ప్రయోజనాలపై బస్టాండ్లు, థియేటర్లు మరియు హోర్డింగ్స్ ద్వారా విస్తృత ప్రచారం చేయాలని డిప్యూటీ సీఎం సూచించారు. 2026 ఆగస్టు నాటికి పనులు ప్రారంభించి, డిసెంబర్ 2027 కల్లా ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. సాంకేతిక అంశాల్లో ఐఐటీ, జేఎన్‌టీయూ వంటి సంస్థల సహకారం తీసుకోవాలని మంత్రి శ్రీధర్ బాబు సూచించగా, వర్షాకాలంలో పనులకు ఆటంకం కలగకుండా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడానికి నాసిక్, ముంబై నగరాల్లో విజయవంతమైన 'రబ్బర్ డ్యామ్' టెక్నాలజీని పరిశీలించి, మూసీలో నీటి నిల్వ మరియు బోటింగ్ సదుపాయాల కోసం వాటిని ఏర్పాటు చేసే అంశంపై అధికారులు అధ్యయనం చేయనున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన టైమ్‌లైన్ ప్రకారం సమన్వయంతో పనిచేసి రాజధాని అభివృద్ధిలో ఈ ప్రాజెక్టును ఒక మైలురాయిగా నిలపాలని సబ్ కమిటీ అధికారులకు దిశానిర్దేశం చేసింది.

## కొడంగల్ వైపు చూసేలా అభివృద్ధి చేస్తా

**మొదటిపేజీ తరువాయి..** అందరూ కలిసికట్టుగా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 2034 వరకు గ్రూపు రాజకీయాలను పక్కన పెట్టి, కొడంగల్‌ను ఒక ఆదర్శవంతమైన నందనవనంగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## 'సోనార్ బంగ్లా' కలల సాకారాం

**మొదటిపేజీ తరువాయి...** శ్యామా ప్రసాద్ ముఖర్జీ జన్మస్థలంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడటం చారిత్రక ఘట్టమని, ఈ విజయం కోసం 321 మంది కార్యకర్తలు ప్రాణత్యాగం చేశారని ఆయన గుర్తుచేశారు. మమతా బెనర్జీని ఆమె సొంత నియోజకవర్గం భవానీపూర్‌లో ఓడించడం ద్వారా ప్రజలు శక్తివంతమైన సందేశాన్ని ఇచ్చారని, అయితే తమ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ కక్షసాధింపు రాజకీయాలకు తావు ఇవ్వదని కార్యకర్తలకు సూచించారు. ఈనెల 9న బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రమాణస్వీకార కార్యక్రమం జరుగుతుందని వెల్లడించిన అమిత్ షా, అంతకుముందు దక్షిణేశ్వర్ కాళీ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు.

## ఇండి కూటమికీ బీటలు

**మొదటిపేజీ తరువాయి...** ఎంపీ కనిమొళి ఆ లేఖలో స్పష్టంగా పేర్కొన్నారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయంపై డీఎంకే ఎమ్మెల్యేలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఇది కూటమికి చేసిన వెన్నుపోటు అని ధ్వజమెత్తారు. కూటమి వల్ల లబ్ధి పొంది రాజ్యసభ సీట్లు, అసెంబ్లీ స్థానాలు గెలుచుకున్న కాంగ్రెస్, తన పాత రాజకీయ స్వభావాన్ని మార్చుకోలేదని డీఎంకే నేతలు ఆక్షేపించారు. కాంగ్రెస్ ద్రోహాన్ని అధిగమించి ఇకపై బలమైన ప్రతిపక్షంగా తమ పంథాను కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు. డీఎంకే నిర్ణయానికి సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ కూడా మద్దతు తెలపడం గమనార్హం. స్వల్పకాలిక ప్రయోజనాల కోసం కీలక భాగస్వామ్య పక్షాలను వదులుకోవడం కాంగ్రెస్ చేస్తున్న పెద్ద తప్పిదమని ఆయన విమర్శించారు. తాజా పరిణామాలతో ఇండీ కూటమిలో బీటలు వారడమే కాకుండా, దక్షిణాది రాజకీయాల్లో సమీకరణాలు పూర్తిగా మారిపోయే అవకాశం కనిపిస్తోంది.

## ప్రధాని పర్యటన తరవాత రాజకీయ మార్పులు

**బీజేపీ అధ్యక్షుడు నారపరాజు రామచందర్‌రావు**

**హైదరాబాద్, మే8 :** ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ నెల 10వ తేదీన తెలంగాణలో పర్యటిస్తున్నారని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు నారపరాజు రామచందర్‌రావు తెలిపారు. ఈ సభ తర్వాత తెలంగాణ రాజకీయాలు మారబోతున్నాయని పేర్కొన్నారు. ఈ సభ ఏర్పాట్లు అన్ని దాదాపు పూర్తి అయ్యాయని చెప్పుకొచ్చారు. పరేడ్ గ్రౌండ్‌లో మోదీ హాజరయ్యే సభ ఏర్పాట్లను శుక్రవారం రామచందర్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.రెండు రోజులపాటు పరేడ్ గ్రౌండ్ పరిసర ప్రాంతాలు అన్ని కేంద్ర బలగాల అధీనంలోకి వెళ్తాయని వెల్లడించారు. గ్రేటర్ ఎన్నికల ముందు మోదీ సభ జరగడం తమ పార్టీకి కలిసి వచ్చే అంశమని తెలిపారు. తెలంగాణ అభివృద్ధిలో మోదీ ప్రాధాన్యం చాలా ఉందని ఉద్ఘాటించారు. రెండు లక్షలకు పైగా మందితో ఈ సభ సక్సెస్ కాబోతుందని అన్నారు. బీజేపీ శ్రేణులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా మోదీ సభ కోసం తరలి వస్తున్నారని తెలిపారు. ఈ సభ కోసం ప్రత్యేక రైళ్లు, బస్సులను ఏర్పాటు చేశామని రామచందర్‌రావు పేర్కొన్నారు.

## 13న పుదుచ్చేరి సిఎంగా రంగస్వామి ప్రమాణం

**చెన్నై,మే8 :** పుదుచ్చేరి ఎన్నార్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎన్.రంగసామి ముఖ్యమంత్రిగా ఈనెల 13న ప్రమాణస్వీకారం చేయనున్నారు. 30 సీట్లు ఉన్న పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో 18 స్థానాలు గెలుచుకుని ఎన్డీయే కూటమి విజయం సాధించింది. ప్రభుత్వ ఏర్పాటుకు కేంద్రమంత్రి మాండవీయ, రంగసామి నేతృత్వంలో మిత్ర పక్ష నాయకులు, ఎమ్మెల్యేలు శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పుదుచ్చేరి ఎన్డీయే కూటమి అధ్యక్షుడిగా ఎన్.రంగసామిని ఎన్నుకుని, తమ పార్టీల తరపున ఆయనకు మద్దతు లేఖ అందజేశారు. అనంతరం లెఫ్టినెంట్ గవర్నర్ కైలాశ్‌నాథన్‌ను లోక్‌నివాస్‌లో కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని కూటమి నేతలు కోరారు. దీంతో ఈనెల 13న సీఎం రంగసామి ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఏర్పాట్లు మొదలయ్యాయి. మంత్రివర్గ సభ్యులు, ఇతర పదవులపై ఇంకా చర్చలు పూర్తికాలేదు. మంత్రుల ప్రమాణస్వీకారం మరో తేదీన జరపాలని నిర్ణయించారు.

## కొడంగల్‌పైనే కాదు..రాష్ట్రంపై శ్రద్ధ పెట్టాలి

**బిఆర్‌ఎస్ ప్రాజెక్టులతో డబ్బులు వృధా చేసింది**

**ఎక్కడా కాల్వలు నిర్మించి నీళ్లు పారించలేదు**

**టిఆర్‌ఎస్ అధ్యక్షురాలు కవిత విమర్శలు**

**హైదరాబాద్, మే8 :** రిజర్వాయర్ల పేరుతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం భారీగా ఖర్చు చేసినా రైతులకు పూర్తిస్థాయిలో నీళ్లు ఇవ్వలేకపోయారని టిఆర్‌ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. రిజర్వాయర్లు నిర్మించడం మాత్రమే సరిపోదని, నీళ్లు పొలాల వరకు చేరాలంటే కాలువలు కూడా నిర్మించాల్సిన అవసరం ఉందని చెప్పారు. వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినా రైతులకు ఆశించిన ప్రయోజనం కలగలేదని విమర్శించారు. టీఆర్‌ఎస్ నిర్వహించిన సభలో ఎమ్మెల్సీ కవిత పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ ఆ ప్రాంతానికి తగిన న్యాయం జరగలేదని ఆరోపించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కాంగ్రెస్‌కు 12 సీట్లు ఇచ్చినా అభివృద్ధి పనులు కనిపించలేదని అన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా ప్రకటించాలని ప్రధాని మోదీని డిమాండ్ చేశారు. అలాగే జనగణనలో కులగణన నిర్వహించాలని, రాష్ట్రం పంపిన బీసీ బిల్లుకు ఆమోదం తెలపాలని కోరారు. కృష్ణా నది తెలంగాణలో ప్రవహిస్తున్నప్పటికీ ఆ నీళ్లు ఆంధ్రప్రదేశ్‌కు వెళ్తున్నాయని ఆమె వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొడంగల్ అభివృద్ధిపైనే కాకుండా రాష్ట్రం మొత్తం అభివృద్ధి బాధ్యత తీసుకోవాలని అన్నారు. తెలంగాణ నీటి హక్కులను కాపాడేందుకే తెలంగాణ రక్షణ సేన ఏర్పడిందని పేర్కొన్న కవిత.. త్వరలో మరో నీటి ఉద్యమాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఆ ఉద్యమానికి లక్ష్మీదేవిపల్లి వేదిక కావడం గర్వంగా ఉందని చెప్పారు. ప్రజలు మరో ఉద్యమానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

## కేంద్రం నిధులతోనే తెలంగాణ బండి నడుస్తోంది

**మోడీ సభను ప్రజలు విజయవంతం చేయాలి**

**కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు**

**హైదరాబాద్, మే8** తెలంగాణ రాష్ట్రం అభివృద్ధికి మోదీ ప్రభుత్వం రూ. వేల కోట్ల నిధులు ఇస్తుందని కేంద్రం హోం శాఖ మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. ఆ నిధులతోనే తెలంగాణ అంతో ఇంతో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. కేంద్రం నిధులు ఇవ్వకుంటే తెలంగాణ అభివృద్ధి చెందే అవకాశమే లేదన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోఆయన మీడియాతో మాట్లాడారు. దేశ రాజధాని నుంచి తాము నిధులు తెస్తుంటే.. కాంగ్రెస్ వాళ్లు తెలంగాణ సొమ్మును ఢిల్లీలోని కాంగ్రెస్ పెద్దలకు పంపుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీని నడుపుకోవడానికి తెలంగాణ సొమ్మును వినియోగిస్తున్నారని ఆరోపించారు. డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే తెలంగాణ మరింత అభివృద్ధి చెందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల ఆశీర్వాదం కోసం మోదీ హైదరాబాద్ వస్తున్నారని వివరించారు. తమ నినాదం జై శ్రీరాం... జై తెలంగాణతోపాటు ఈ రాష్టాన్ని అభివృద్ధి చేయడమే అని స్పష్టం చేశారు. జై శ్రీరాం.. జై తెలంగాణ నినాదాలతో పరేడ్ బహిరంగ సభ దద్దరిల్లుతుందని చెప్పారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాదిరిగా తనకు దోచుకోవడం తెలియదన్నారు. రైతులకు బేడీలు వేసి అరిగోస పెట్టడం తనకు తెలియదని చెప్పారు. డ్రగ్స్ తీసుకోవడం కూడా తమకు తెలియదని పేర్కొన్నారు. కాళేశ్వరం, ఈ పార్ములా, విద్యుత్ కొనుగోళ్ల అవినీతి వంటివి తమకు తెలియదని కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యంగ్యంగా అన్నారు. ఫాంహౌస్ డ్రగ్స్ కేసులు కూడా తమకు తెలియదని చెప్పారు. మంది కొంపలు ముంచడం అసలే తెలియదంటూ కేటీఆర్‌కు చురకలు అంటించారు. నోరు అదుపులోకి పెట్టుకోవాలంటూ కేటీఆర్‌కు ఈ సందర్భంగా బండి సంజయ్ సూచించారు. నీ అహంకారం వల్లే కేసీఆర్ ఫాంహౌస్‌కు పరిమితమయ్యారని చెప్పారు. నీ కార్యకర్తలే కేటీఆర్‌ను చూసి ఆ పార్టీ కార్యకర్తలే అసహ్యించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ఏం చేసినా అధికారంలోకి రావడం కల్ల అని కుండ బద్దలు కొట్టారు. ఎప్పుడు ఎన్నికలొచ్చినా తెలంగాణలో అధికారంలోకి వచ్చేది బీజేపీయే అని ఆయన జోస్యం చెప్పారు. మోదీ సభ తరువాత రాష్ట్రంలో
జరగబోయేది చూడండంటూ అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్‌ఎస్ పార్టీలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. మే10వ తేదీన సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ వేదికగా జరిగే ప్రధాని మోదీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

## 12న ఇంద్రీకీలాద్రిపై హనుమత్ జయంతి

**విజయవాడ, మే8 :** ప్రముఖ పుణ్యక్షేత్రం ఇంద్రకీలాద్రిపై మే 12న హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ వేడుకల కోసం దుర్గగుడి అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. మే 12న ఉదయం 6 గంటల నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభంకానున్నాయి. ఆలయ ప్రాంగణంలో ఉన్న మూడు ఆంజనేయస్వామి ఆలయాల్లో విశేష పూజలు జరుగనున్నాయి. అభయ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నారు. క్షేత్ర పాలక ఆంజనేయస్వామికి ఆకుపూజ కార్యక్రమం చేయనున్నారు. మెట్ల మార్గంలోని ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకులు పూజలు నిర్వహించనున్నారు. నాగవల్లీ దళార్చన శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని పుష్పాలు, ప్రత్యేక దండలతో ఆలయాలను సర్వాంగ సుందరంగా అలంకరించనున్నారు.

## పోలీస్ అధికారి భార్య హత్య

**నేపాలీ గ్యాంగ్‌గా అనుమానం**

**క్లూ ఆధారంగా వేంగంగా విచారణ**

**నగర పోలీస్ కమిషనర్ సజ్జన్నార్ వెల్లడి**

**హైదరాబాద్, మే8 :** జూబ్లీహిల్స్‌లోని ప్రశాసన్ నగర్‌లో రిటైర్డ్ డీజీ వినయ్ రంజన్ రాయ్ సతీమణి తనుజా (55) హత్యకు గురయ్యారు. ఈ హత్యకు సంబంధించిన వివరాలపై హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ మీడియాతో మాట్లాడారు. రిటైర్డ్ డీజీ సతీమణి తనూజ హత్య గావింపబడిందని తమకు మొదటగా సమాచారం వచ్చిందని తెలిపారు. రిటైర్డ్ డీజీ భార్య తనుజాను గురువారం రాత్రి రెండు గంటలకు దుండగులు హత్య చేశారని చెప్పుకొచ్చారు. నేపాలి గ్యాంగ్ పనిగా ప్రాథమికంగా తాము ఒక అంచనాకు వచ్చామని అన్నారు. కొన్ని క్లూస్ లభించాయని.. ఆ క్లూస్ ఆధారంగా ఈ కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. నేపాలి పనివాళ్లపై అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నేపాలి పని మనుషులు ఇంట్లో ఎవరూ లేనప్పుడు నేరాలకు పాల్పడుతున్నారని సీపీ సజ్జనార్ చెప్పుకొచ్చారు. గురువారం రాత్రి రిటైర్డ్ డీజీ ఇంట్లో ఎవరు లేనప్పుడు పనిమనిషి కల్పన అనే మహిళ మరికొందరితో కలిసి ఈ దారుణం చేసిందని తెలిపారు. ఈ ఘటన సమయంలో పిల్లలు ఇద్దరు పై ఫ్లోర్‌లో ఉన్నారని.. తనుజ గ్రౌండ్ ఫో÷-లోర్‌లో ఉన్నారని వెల్లడించారు. ఇంట్లో ఉన్న పనిమనిషి కల్పనతో బయట వ్యక్తులు కాంటాక్ట్ పెట్టుకొని ఈ క్రైమ్ చేశారని చెప్పారు. ప్రజలు భయాందోళనకు గురికావొద్దని.. నిందితులను త్వరలో పట్టుకుంటామని తెలిపారు. నేపాలి పనిమనుషులు ఇంట్లో ఏడాది, రెండో ఏడాది పనిచేసిన కూడా వాళ్లపై
నిఘా ఉంచాలని సీపీ సజ్జనార్ అన్నారు. ఈ కేసును చాలా సీరియస్‌గా తీసుకుంటున్నామని తెలిపారు. చేతులు కట్టేసి నోట్లో గుడ్డలు కుక్కి ఆమెను ఈ గ్యాంగ్ హత్య చేసిందని చెప్పారు. రిటైర్డ్ డీజీ తల్లి కోసం ఆమె హైదరాబాద్ వచ్చారని తెలిపారు. ఇటీవల రిటైర్డ్ డీజీ తల్లి మరణించారని.. అప్పటి నుంచి తనుజ ఇక్కడే ఉంటున్నారని వివరించారు. ఈ కేసులో ఎంత బంగారం, నగదు పోయిందనే అంశాలపై ఆరా తీస్తున్నామని తెలిపారు. నిందితులు బ్యాక్ గేట్ నుంచి ఇంట్లోకి ప్రవేశించారని.. ఘటన అనంతరం వెనుక నుంచి పారిపోయారని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

## జూబ్లీహిల్స్ ప్రశాసన్ నగర్‌లో దారుణం

**విశ్రాంత పోలీస్ అధికారి వినయ్ రంజన్ సతీమణి హత్య**

**ఇంటి పనిమనిషి కల్పనే సూత్రధారి**

**హైదరాబాద్, మే8 :** జూబ్లీహిల్స్‌లోని ప్రశాసన్ నగర్‌లో దారుణ హత్య జరిగింది. విశ్రాంత ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రాయ్ సతీమణి తనూజ (55) హత్యకు గురయ్యారు. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి నివాసంలో పని చేస్తున్న నేపాల్‌కు చెందిన పని మనిషి కల్పన ఈ హత్యలో కీలక పాత్ర పోషించినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. పోలీసుల అనుమానం ప్రకారం, కల్పన మరో ముగ్గురితో కలిసి ముందస్తు ప్రణాళికతో హత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. తనూజ ఒంటరిగా ఉన్న విషయాన్ని తన గ్యాంగ్‌కు చెప్పిన కల్పన గురువారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో వారితో కలిసి హత్యకు పాల్పడినట్లు సమాచారం. హత్య అనంతరం ఇంట్లో ఉన్న బంగారం, నగదు తీసుకుని నిందితులు పరారైనట్లు పోలీసులు భావిస్తున్నారు. కాగా, 8 నెలలుగా ఆ ఇంట్లో కల్పన పని చేస్తోంది. మరోవైపు ఘటనాస్థలికి ఉన్నతాధికారులు చేరుకుని పరిశీలించారు. కేసును అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్న పోలీసులు నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల నివాస ప్రాంతంలో హత్య జరగడం సంచలనంగా మారింది. హత్య విషయం తెలిసిన వెంటనే రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఇంటికి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ చేరుకున్నారు. కాగా, వినయ్ రంజన్ రాయ్ ప్రస్తుతం బెంగళూరులో ఉన్నట్లు తెలుస్తోంది.

## కేరళం సిఎం రేసులో కెసి వేణుగోపాల్

**పార్టీ అధ్యక్షుడికి పరిశీలకుల నివేదిక**

**న్యూఢిల్లీ, మే8 :** కేరళంలో కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ కూటమి విజయం సాధించడంతో ముఖ్యమంత్రి ఎంపికకు కసరత్తు జరుగుతోంది. ఈ రేసులో లోక్‌సభ ఎంపీ కేసీ వేణుగోపాల్ ముందున్నారని తెలుస్తోంది. ఈ మేరకు పార్టీ పరిశీలకులు అజయ్ మాకెన్, ముకుల్ వాస్నిక్‌లు తమ నివేదికను పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు సమర్పించినట్టు పార్టీ వర్గాలు శుక్రవారంనాడు తెలిపాయి. పార్టీకి ఎన్నికైన ఎమ్మెల్యేలు, కూటమి భాగస్వాములు, ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని పార్టీ తుది నిర్ణయం తీసుకోనున్నట్టు తెలుస్తోంది. సీఎం అభ్యర్థుల రేసులో కేసీ వేణుగోపాల్‌తో పాటు గత అసెంబ్లీలో విపక్ష నేత వీడి సతీశన్, వెటన్ కాంగ్రెస్ నేత రమేష్ చెన్నితాల పోటీ పడ్డారు. అయితే పార్టీ అధిష్టానానికి అత్యంత విశ్వసనీయుడిగా పేరున్న 63 ఏళ్ల కేసీ వేణుగోపాల్ ముందు వరుసలో ఉన్నట్టు చెబుతున్నారు. ఆయనను తదుపరి సీఎంగా అధిష్టానం ప్రకటిస్తే ఎంపీ స్థానానికి ఆయన రాజీనామా చేయాల్సి ఉంటుంది. కాగా,

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక



# ముకుందాపురంలో విషాదం: లారీ ఢీకొని నలుగురు 'గోమాతలు' మృతి..

**❑ మూగజీవాల రక్షణకు పురపాలక శాఖ , గ్రామపంచాయతీ శాఖ చొరవ చూపాలి: జంతు సంక్షేమ బోర్డు మాజీ సభ్యులు డాక్టర్ సతీష్ ఖండేల్వాల్ విజ్ఞప్తి**

ఇల్లందు మే 08 (జన సంఘర్షణ)

ముకుందాపురం రహదారిపై నేడు చోటుచేసుకున్న ఘోర ప్రమాదం స్థానికులను తీవ్రంగా కలచివేసింది. అతివేగంగా వచ్చిన లారీ నిలిచి ఉన్న ఆవుల మందపైకి దూసుకెళ్లడంతో నలుగురు గోమాతలు అక్కడికక్కడే ప్రాణాలు విడిచాయి. మరణించిన ఆవులు స్థానిక రైతులవేనని తెలియడంతో ఆ కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. తమ జీవనాధారమైన పశు వులు కళ్లముందే విగతజీవులుగా పడి ఉండటం చూసి రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు లారీని స్వాధీనం చేసుకుని దర్యాప్తు జరుపుతుండగా, ఈ ఘటన ఇల్లందు పరిసరాల్లో మూగజీవాల రక్షణ ఆవశ్యకతను మరోసారి గుర్తుచేస్తోంది. తెలంగాణ ప్రభుత్వం జంతు సంక్షేమ బోర్డు మాజీ సభ్యులు డాక్టర్ సతీష్ ఖండేల్వాల్ ఈ ఘటనపై తక్షణమే స్పందిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో మున్సిపల్ పరిధిలో ఇటువంటి ప్రమాదాలు జరిగినప్పుడు మున్సిపల్ కమిషనర్ ఎంతో సానుకూలంగా స్పందించి, తగు సహాయ సహకారాలు అందించారని ఆయన గుర్తుచేశారు. మున్సిపల్ యంత్రాంగం యొక్క ఆ మంచి పనితీరును ప్రశంసిస్తూనే, నేడు ముకుందా పురంలో జరిగిన ఈ దారుణ విషయాన్ని మరోసారి వారి దృష్టికి తీసుకువెళ్లి, భవిష్యత్తులో ఇటువంటి ప్రాణనష్టాలు జరగకుండా శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేస్తామని డాక్టర్ సతీష్ ఖండేల్వాల్ భరోసా ఇచ్చారు. ఇలాంటి విపత్కర సమయాల్లో హిందూ సంఘాలు ప్రదర్శిస్తున్న సేవా నిరతి మరువలేనిది. ప్రమాదానికి గురైన ఆవులతో పాటు కుక్కలు, కోతులు వంటి ఇతర మూగజీవాలు మరణించినప్పుడు, ప్రభుత్వ యంత్రాంగం కంటే ముందే హిందూ సంఘాల ప్రతినిధులు స్పందిస్తున్నారు. తమ సొంత నిధులతో ఆ జీవాలకు శాస్త్రోక్తంగా, గౌరవప్రదంగా ఖననం నిర్వహిస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్నారు. ఈ నిస్వార్థ సేవను గుర్తించి, మున్సిపల్ మరియు పంచాయతీ శాఖలు కూడా జంతు సంక్షేమం కోసం ఒక ప్రత్యేక వ్యవస్థను బలోపేతం చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. నిజానికి, రహదారులపై మూగజీవాల సంచారాన్ని నియంత్రించడం ద్వారా అటు జంతువుల ప్రాణాలను, ఇటు వాహనదారుల భద్రతను కాపాడవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మున్సిపల్ అధికారులు, పంచాయతీ పాలకవర్గాలు సమన్వయంతో పనిచేసి, గ్రామాల్లో, పట్టణ శివార్లలో పశువుల కోసం ప్రత్యేక ఆశ్రయాలను ఏర్పాటు చేయాలి. గతంలో కమిషనర్ చూపిన అదే చొరవను ఇప్పుడు కూడా కొనసాగిస్తూ, మున్సిపల్ శాఖ నుండి అవసరమైన స్థలాన్ని లేదా షెడ్లను కేటాయిస్తే రైతన్నలకు, మూగజీవాలకు పెద్ద ఊరట లభిస్తుంది. ముకుందాపురం ఘటనను దృష్టిలో ఉంచుకుని, డాక్టర్ సతీష్ ఖండేల్వాల్ నేతృత్వంలో అధికారులు ఒక సమగ్ర ప్రణాళికను రూపొందించాలని ప్రజలు కోరుకుంటున్నారు. అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న తెలంగాణ రాష్ట్రంలో, జంతు సంక్షేమం కూడా ఒక ముఖ్యమైన భాగంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. అధికారులు, సామాజిక కార్యకర్తల ఉమ్మడి కృషితో ఇల్లందు రహదారులు మృత్యుకూపాలుగా మారకుండా, సురక్షితమైన మార్గాలుగా మారుతాయని, మున్సిపల్ శాఖ తక్షణమే సానుకూల చర్యలు తీసుకుంటుందని ఆశిద్దాం.




గతంలో జరిగిన ప్రమాదాలు




ప్రస్తుతం ముకుందపురంలో జరిగినటువంటి ప్రమాదం

# పోగొట్టుకున్న పర్సును క్షేమంగా బాధితుడికి అందజేత!

**❑ నిజాయితీకి నిలువుటద్దం ఆర్ఎస్ఎస్ సభ్యుడు జయప్రకాష్**

ఇల్లందు మే 08 (జన సంఘర్షణ)

ఇల్లందులో ఇటీవల నిర్వహించిన హిందూ సమ్మేళనం కార్యక్రమంలో ఒక అరుదైన మానవీయ సంఘటన చోటుచేసుకుంది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన కావేటి మల్లేశం అనుకోకుండా తన మనీ పర్సును పోగొట్టుకున్నారు. అయితే, కార్యక్రమ నిర్వహణలో ఉన్న అప్రమత్తమైన కార్యకర్తలకు ఆ పర్సు లభించడంతో, వెంటనే సభా వేదిక నుంచి మైక్ ద్వారా అనౌన్స్ చేయించారు. కానీ, ఆ సమయానికే మల్లేశం అక్కడి నుంచి వెనుదిరగడంతో ఆ పర్సును వారు అందుకోలేకపోయారు. బాధితుడి ఆవేదనను గుర్తించిన ఆర్ఎస్ఎస్ సభ్యుడు జయప్రకాష్ బృందం, ఆ పర్సును భద్రపరిచి ఎలాగైనా యజమానికి చేర్చాలని నిర్ణయించుకున్నారు. ఆ పర్సులో ఉన్న ఆధారాల ద్వారా మరుసటి రోజు రోహిత్, బృందం సుమారు 45 నిమిషాల పాటు శ్రమించి, బాధితుడి ఇంటిని వెతికి పట్టుకున్నారు. మల్లేశం గారు ఆ సమయంలో అందుబాటులో లేకపోవడంతో తదుపరి రోజు ఆయన గాయత్రి పరివార్ హాల్‌కు రావడం జరిగింది. అక్కడ ఆర్ఎస్ఎస్ ప్రముఖులు జయప్రకాష్, సతీష్ ఖండేల్వాల్ లు స్వయంగా మల్లేశంని కలిసి, పర్సులోని నగదు, పత్రాలు అన్నీ సరిచూసుకున్న తర్వాత క్షేమంగా ఆయనకు అందజేశారు. జయప్రకాష్ చొరవతో తను పోగొట్టుకున్న వస్తువు తిరిగి లభించడంతో మల్లేశం ఎంతో సంతోషం వ్యక్తం చేస్తూ వారిని అభినందించారు. నిజాయితీ, సేవే పరమావధిగా పనిచేసే ఆర్ఎస్ఎస్ సభ్యుల క్రమశిక్షణకు జయప్రకాష్ నిదర్శనంగా నిలిచారు. ఒక వ్యక్తి పోగొట్టుకున్న వస్తువును కేవలం భద్రపరచడమే కాకుండా, బాధితుడి చిరునామా వెతికి మరీ పిలిపించి ఇవ్వడం వారి బాధ్యతాయుతమైన ప్రవర్తనకు అద్దం పడుతోంది. జయప్రకాష్ చూపిన ఈ నిజాయితీని హిందూ సంఘాల ప్రతినిధులు, స్థానికులు కొనియాడుతున్నారు. ఇటువంటి సంఘటనలు సమాజంలో నమ్మకాన్ని పెంపొందిస్తాయని, ఆపదలో ఉన్నవారికి తోడుగా నిలబడటమే అసలైన హిందూ ధర్మమని జయప్రకాష్ ఈ సందర్భంగా గుర్తుచేశారు.




# చట్టం ముందు ఎవరూ చుట్టం కాదు

**❑ దొంగతనం, వసూళ్లకు పాల్పడితే జైలు శిక్ష తప్పదని భద్రాచలం కోర్టు హెచ్చరిక!**

ఇల్లందు మే 08 (జన సంఘర్షణ)

సమాజంలో నేర ప్రవృత్తి పెరిగిపోతున్న తరుణంలో, నేరం ఏదైనా శిక్ష తప్పదని భద్రాచలం జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు స్పష్టమైన సంకేతాలు పంపింది. మొబైల్ దొంగతనం చేసినా, హోదాను అడ్డుపెట్టుకుని బెదిరింపులకు పాల్పడినా చట్టం తన పని తాను చేసుకుపోతుందని నిరూపిస్తూ మేజిస్ట్రేట్ వి. శివనాయక్ నేడు రెండు వేర్వేరు కేసుల్లో కీలక తీర్పులు వెలువరించారు. సెల్ ఫోన్ దొంగిలించిన కేసులో (సీసీ నెం. 530/2022) సాక్ష్యాధారాలు నిరూపితం కావడంతో బండారు సాయి తేజ అనే వ్యక్తికి ఏడు నెలల జైలు శిక్షతో పాటు 500 రూపాయల జరిమానా విధిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. మరొక సంచలన తీర్పులో, వృత్తిరీత్యా న్యాయవాది అయిన వ్యక్తి చట్టాన్ని అతిక్రమించి బెదిరింపులకు పాల్పడటంపై కోర్టు తీవ్రంగా స్పందించింది. కొత్తపేట కాలనీకి చెందిన దూడల దయామూర్తి అనే వ్యక్తి బెదిరించి డబ్బులు వసూలు చేసిన కేసులో (సీసీ నెం. 483/2018) దోషిగా తేలారు. చట్టంపై అవగాహన ఉన్న వ్యక్తే ఇటువంటి అక్రమాలకు పాల్పడటం సామాజికంగా చర్చనీయాంశమైంది. ఈ కేసులో వాదోపవాదనలు విన్న న్యాయమూర్తి, నిందితుడికి ఆరు నెలల జైలు శిక్ష, 500 రూపాయల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. న్యాయం వెతకాల్సిన చోటే అన్యాయం జరిగితే సహించేది లేదని ఈ తీర్పు ద్వారా కోర్టు స్పష్టం చేసింది. ఈ రెండు తీర్పులు సమాజానికి ఒక బలమైన సందేశాన్ని ఇస్తున్నాయి. అది సామాన్యుడైనా, చట్టం తెలిసిన వారైనా.. తప్పు చేస్తే జైలు ఊచలు లెక్కపెట్టాల్సిందేనని ఈ శిక్షలు హెచ్చరిస్తున్నాయి. చిన్న దొంగతనమే కదా అని నిర్లక్ష్యం చేసే వారికి, తమ పలుకుబడితో బెదిరింపులకు పాల్పడే వారికి భద్రాచలం కోర్టు తీర్పు ఒక గుణపాఠంలా నిలుస్తుంది. బాధితులు ధైర్యంగా ముందుకు వచ్చి పోలీసులను ఆశ్రయిస్తే, ఆలస్యమైనా సరే న్యాయం ఖచ్చితంగా గెలుస్తుందని ఈ జడ్జిమెంట్లు మరోసారి నిరూపించాయి.



# సింగరేణి 'ఓసీ' సెగ: నిర్వాసితులకు న్యాయం జరిగేనా?

ఇల్లందు మే 08 (జన సంఘర్షణ)

ఓసీ విస్తరణ నేపథ్యంలో విజయలక్ష్మి నగర్, తిలక్ నగర్ సర్పంచులు రమేష్ బాబు, స్రవంతి నేతృత్వంలోని అఖిలపక్ష బృందం శుక్రవారం ఇల్లందులో ఆర్డీవో మధును కలిసి వినతిపత్రం అందజేశారు. కేవలం 20 శాతం ప్రాంతాన్ని మాత్రమే ప్రభావిత ప్రాంతంగా గుర్తించడం అన్యాయమని, మిగిలిన 80 శాతం ప్రాంతాన్ని కూడా సింగరేణి దత్తత తీసుకొని అభివృద్ధి చేయాలని వారు డిమాండ్ చేశారు. కేవలం భూములు తీసుకోవడమే కాదు, నిర్వాసితుల జీవితాలకు మెరుగైన ప్యాకేజీతో భరోసా కల్పించాలని కోరారు. దీనిపై ఆర్డీవో సానుకూలంగా స్పందిస్తూ అందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ధనసరి రాజు, వడ్ల శ్రీను, క్లింట్ రోచ్ తదితరులు పాల్గొన్నారు.




# ప్రజాక్షేత్రంలో 'రమేష్ బాబు': అటు పోరాటం.. ఇటు సేవ!

**❑ చలివేంద్రం సేవలు భేష్: డీఎల్పీఓ ప్రశంస**

ఇల్లందు మే 08 (జన సంఘర్షణ)

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా విజయలక్ష్మి నగర్ సర్పంచ్ చాందావత్ రమేష్ బాబు దూసుకుపోతున్నారు. ఒకవైపు సింగరేణి ఓసీ నిర్వాసితులకు న్యాయం జరగాలని ఆర్డీవో కార్యాలయం మెట్లెక్కి పోరాటం చేస్తూనే, మరోవైపు వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేసి తన సేవా గుణాన్ని చాటుకుంటున్నారు. శుక్రవారం ఆయన చేపట్టిన ఈ రెండు కార్యక్రమాలను జిల్లా అధికారులు మరియు అఖిలపక్ష నాయకులు ప్రత్యేకంగా అభినందించారు. నిర్వాసితుల అంశంలో రమేష్ బాబు స్పష్టమైన వైఖరిని ప్రదర్శించారు. కేవలం 20 శాతం భూమినే ప్రభావిత ప్రాంతంగా గుర్తించడం అన్యాయమని, మిగిలిన 80 శాతం ప్రాంతాన్ని కూడా సింగరేణి దత్తత తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆర్డీవో మధుకు వినతిపత్రం అందజేశారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం ఆయన చూపిస్తున్న చొరవకు ఆర్డీవో సానుకూలంగా స్పందిస్తూ, అందరికీ న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఇక వేసవి కాలంలో బాటసారుల కష్టాలను గుర్తించి రమేష్ బాబు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డీఎల్పీఓ స్వయంగా సందర్శించారు. నిరంతరం నీటి సరఫరా జరిగేలా ఆయన తీసుకుంటున్న జాగ్రత్తలను అధికారులు ప్రశంసించారు. పదవి అంటే అధికారం మాత్రమే కాదు, బాధ్యత అని నిరూపిస్తున్న రమేష్ బాబుకు పాలకవర్గ సభ్యులు మరియు గ్రామ ప్రజలు అండగా నిలుస్తున్నారు.




# ఇల్లందులో ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభం

ఇల్లందు మే 08 (జన సంఘర్షణ)

పురపాలక సంఘం చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ దంపతులు శుక్రవారం ఇల్లందులోని 1వ వార్డులో ఉచిత కంటి పరీక్ష కేంద్రాన్ని ప్రారంభించారు. స్థానిక కౌన్సిలర్ ఎస్కే సైదు మియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో వందలాది మంది ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి చూపు పట్ల నిర్లక్ష్యం వహించకుండా ప్రతి ఒక్కరూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా చైర్ పర్సన్ సూచించారు. స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ శిబిరంలో ఉచితంగా మందులు అందజేయడమే కాకుండా, అవసరమైన వారికి శస్త్రచికిత్సలపై అవగాహన కల్పించారు. వార్డు ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక చొరవ తీసుకున్న కౌన్సిలర్ సైదు మియాను ఈ సందర్భంగా నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.




# సర్పంచుల సారథిగా 'మందా నాగరాజు': ఏకగ్రీవం!

బూర్గంపాడు మే 08 (జన సంఘర్షణ)

మండల సర్పంచుల సంఘం నూతన అధ్యక్షుడిగా బూర్గంపాడు సర్పంచ్ మందా నాగరాజు శుక్రవారం సారపాకలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మే 8వ తేదీన జరిగిన ఈ ఎన్నికలో మండలంలోని సర్పంచులందరూ ఏకతాటిపైకి వచ్చి కమిటీని ఎన్నుకోగా, ఉపాధ్యక్షులుగా తాటి వాణి, బానోతు పద్మ, కృష్ణవేణి, నాగమణి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పూనం సురేందర్, కోశాధికారిగా కుంజా కొండమ్మ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా సర్పంచులందరినీ సమన్వయం చేసుకుంటూ గ్రామాల అభివృద్ధికి, స్థానిక సంస్థల బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో గుండి బాబురావు, బానోతు సరోజ తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

ఎల్లారెడ్డి, మే -8(జన సంఘర్షణ )

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచి సకాలంలో కొనుగోళ్లలను పూర్తి చేయాలని ఎల్లారెడ్డి నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ శ్రీనివాస్ కొనుగోలు కేంద్రం నిర్వాహకులు అన్నారు. శుక్రవారం మండలంలోని హాజీపూర్ తాండ, లక్ష్మాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి కొనుగోలు ప్రక్రియలను పరిశీలించారు. ఈసందర్భంగా ధాన్యం రాశులు పరిశీలించి పలు సూచనలు చేశారు. ధాన్యం కొనుగోలులో వేగం పెంచి పూర్తిచేయాలని కోరారు. కొనుగోలు చేసిన ధాన్యం కేటాయించిన రైస్‌మిల్లుకు తరలించాలని సూచించారు. కేంద్రాల నిర్వహకులు రైతులను ఇబ్బందులు గురి చేయవద్దని సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఆయన వెంట ఆర్ఐ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



# ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో స్వీయ గణనపై అవగాహన ర్యాలీ

ఎల్లారెడ్డి, మే -8(జన సంఘర్షణ )

2027 జనగణనలో భాగంగా స్వీయ గణన చేసుకునేందుకు ఈనెల 10 వరకు మాత్రమే అవకాశం ఉందని ఎల్లారెడ్డి లోని ప్రతి ఒక్క స్వీయ గణన చేసుకోవాలని ఎల్లారెడ్డి ఆర్డీఓ ప్రభాకర్ అన్నారు. స్వీయ గణనపై ప్రజలు ఆవున కల్పించేందుకు మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ ప్రభాకర్ మాట్లాడుతూ జనగణన భాగంగా ముందుగా స్వీయ గణన గృహాల లెక్కింపు జనగణన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత నెల 26 నుంచి ప్రారంభమైన స్వీయ గణన ఈనెల పదితో ముగుస్తుందని ఎల్లారెడ్డి మున్సిపాలిలోని ప్రతి ఒక్కరు స్వీయ ఘనలో పాల్గొనాలని కోరారు. ఇంటిలో ఉండే స్వీయ గణన చేసుకోవచ్చని 16 భాషల్లో ఘనంగా చేసుకునేందుకు అవకాశం ఉందని మొబైల్ లోని స్వీయ చేసుకోవచ్చని ఇది చాలా సులభమని తెలిపారు. దేశ ప్రణాళిక భవిష్యత్తు అభివృద్ధి అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేసేందుకు జనగణన ఉపయోగపడుతుందని అన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ మాట్లాడుతూ... స్వీయ ఘనంగా సందర్భంగా అద్దె ఇంట్లో ఉన్న అక్కడి నుండే వివరాలను నమోదు చేసుకోవచ్చని తెలిపారు జన





గణన సందర్భంగా సరైన సమాచారం ఇవ్వాలని ఇది భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. జనగణన జనాభా లెక్కలకు తప్పు ఇతర దేశానికి ఉపయోగించడం జరగదని అందువల్ల ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. ఇంట్లో ఉన్న వారందరి వివరాలను తెలియజేయాలని కుటుంబానికి ఒక ఎన్యుమరేషన్ ఐడి వస్తుందని దీని ఆధారంగా ఎన్యుమరేటర్లు ఇంటింటికి వచ్చినప్పుడు జనగణ జాతకం లేకుండా చేసుకునేందుకు వీలుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్, మున్సిపల్ మేనేజర్ స్రవంతి, ఎంపీఓ ప్రకాష్, కౌన్సిలర్లు సిద్ధి శ్రీధర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కురుమ సాయిబాబా, డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు విద్యాసాగర్, శ్యామ్ వివిధ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడ కేసీఆర్ కాలనీలో విషాదం...

- లారీ ఢీకొని మూడు ఆవులు మృతి
- రోడ్డు ప్రమాదంలో మూగజీవాల బలి... మరో మూడు ఆవుల పరిస్థితి విషమం

ఇల్లందు ప్రతినిధి (జన సంఘర్షణ)

ఇల్లెందు మండలం పరిధిలోని వేములవాడ కేసీఆర్ కాలనీ వద్ద శుక్రవారం సాయంత్రం ఐదు గంటల సమయంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. రోడ్డు మీద వెళ్తున్న ఆవులను అతివేగంగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో మూడు ఆవులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో మూడు ఆవులు తీవ్ర గాయాలతో విషమ పరిస్థితిలో ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనతో స్థానికంగా విషాద ఛాయలు అలుముకున్నాయి. స్థానికుల కథనం ప్రకారం, సాయంత్రం సమయంలో రహదారిపై ఉన్న పశువులను వేగంగా వచ్చిన లారీ బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో మూడు ఆవులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాయి. గాయపడిన మరో మూడు ఆవులు ప్రాణాపాయ స్థితిలో ఉండటంతో స్థానికులు చికిత్స అందించే ప్రయత్నాలు చేపట్టారు. ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా అక్కడి నుంచి పరారైనట్లు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మృతిచెందిన పశువుల యజమానులు అక్కడికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. తమ జీవనాధారంగా ఉన్న ఆవులు ఒక్కసారిగా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అతివేగంగా వాహనాలు నడుపుతున్న డ్రైవర్ల నిర్లక్ష్యమే ఇటువంటి ప్రమాదాలకు కారణమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదానికి కారణమైన లారీని గుర్తించి డ్రైవర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి పరారైన లారీ కోసం



గాలింపు చర్యలు చేపట్టినట్లు సమాచారం.

# బిజెపి బహిరంగ సభ ఆహ్వాన కరపత్రాల పంపిణీ

- బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్

జనసంఘర్షణ డెస్క్ మే 08

ఈ నెల 10వ తేదీ ఆదివారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో జరగబోయే బిజెపి బహిరంగ సభకు మన భారత ప్రధాని నరేంద్ర మోడీ హాజరుకానున్న నేపథ్యంలో వారికి ఘన స్వాగతం పలికి, బహిరంగ సభకు ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొనాలని కోరుతు గాంధీనగర్ డివిజన్ చిక్కడపల్లి లోని బాపు నగర్, వివేక్ నగర్ బస్తీ, కాపువాడ, పర్థివాడ బస్తీల్లో, పీపుల్స్ పార్క్ వెల్ఫేర్ అసోసియేషన్ లోని కాలనీ వాసులకు, వాకర్లకు బిజెపి బహిరంగ సభ కరపత్రాలను బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్ అందచేసారు. మేధావులు, డాక్టర్లు, అడ్వకేట్లు, ఉన్నత విద్యావంతులు, నిరుద్యోగులు, బిజెపి అభిమానులు భారీఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. కరపత్రాల పంపిణీ ఈ కార్యక్రమంలో బిజెపి డివిజన్ అధ్యక్షుడు వి.నవీన్ కుమార్, సీనియర్ నాయకులు శ్రీకాంత్, దామోదర్, సత్తి రెడ్డి, శ్రీనివాస్, సత్యేంధర్, లక్ష్మి, బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.




# ఎల్లారెడ్డిలో జ్యువెలరీ షాపులో చోరీకి దొంగల యత్నం

ఎల్లారెడ్డి, మే 8 (జన సంఘర్షణ ):

ఎల్లారెడ్డి పట్టణంలోని ఆవుసుల మాణిక్యంకు చెందిన సద్గురు జ్యువెలర్స్ దుకాణంలో గురువారం రాత్రి దుండగులు చోరీకి యత్నించి విఫలమయ్యారాని షాప్ యజమాని అన్నారు. షాపుకు సంబంధించిన మూడు తాళాలలో రెండింటిని పగలగొట్టి దొంగతనానికి యత్నించారు. మరో తాళం పగలకపోవడంతో అక్కడి నుంచి పరారయ్యారు. ఈ షాపులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ వాటిని వేరే వైపు తిప్పి దొంగతనానికి ప్రయత్నించారు. ఇలా చేయడం ఇది మూడోసారి అని షాపు యజమాని మాణిక్యం తెలిపారు. పోలీసులు రాత్రివేళ పెట్రోలింగ్ పెంచి దొంగతనాల నివారణకు కృషి చేయాలని ఆయన కోరారు. అదృష్టవ శాత్తు దుకాణంలో ఎలాంటి బంగారు, వెండి ఆభరణాలు చోరీకి గురికాలేదు. గత రెండు రోజుల క్రితం ఎల్లారెడ్డి ప్రభుత్వాసుపత్రి వద్ద పార్కు చేసిన ఓ ద్విచక్ర వాహనాన్ని సైతం దుండగులు ఎత్తుకెళ్లారు. దీంతో పట్టణ ప్రజలు తీవ్రభాయ భ్రాంతులకు గురవుతు న్నారు. పట్టణంలో దొంగతనాలు నివారణకు పోలీసులు నిఘా పెంచాలని ప్రజలు కోరుతున్నారు.



# మీసాన్ పల్లి గ్రామం వద్ద చలివేంద్రం ఏర్పాటు

ఎల్లారెడ్డి, మే -8(జన సంఘర్షణ )

ఎల్లారెడ్డి మండలంలోని మీసాన్పల్లి గ్రామంలో శు క్రవారం స్థానిక సర్పంచ్ బోండ్ల మైసయ్య ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. చలివేంద్రాన్ని ప్రారంభిం చిన అనంతరం సర్పంచ్ మైసయ్య మాట్లాడుతూ.. వేసవిలో గ్రామ ప్రజలతో పాటు రోడ్డు వెంట వెళ్లేవారు చల్లటి నీరు తాగాలని సూచించారు. సాధ్యమైనంతవరకు ఎండలో ప్రజలు ఎవరు బయటకు తిరగవద్దని, గ్రామ ప్రజలు వ్యవసాయ పనులను ఉదయం లేదా సాయంత్రం వేళల్లో చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భాగయ్య, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, కారోబార్ ఏగుల అనిల్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# పవిత్ర హజ్ యాత్రకు బయలుదేరుతున్న మాజీ జడ్పీటీసీకి సన్మానం

ఎల్లారెడ్డి, మే -8(జన సంఘర్షణ )

పవిత్ర హజ్ యాత్రకు బయలుదేరుతున్న ఎల్లారెడ్డి మాజీ జెడ్పీటీసీ షేక్ గయాజుద్దీన్ కు వారి కుటుంబ సభ్యలను ఎల్లారెడ్డి వెంకటేశ్వర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ నాగేశ్వరరావు, ఎల్లారెడ్డి మున్సిపాలిటీ కౌన్సిలర్ సిద్ధం శ్రీధర్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు హజ్ యాత్ర విజయవంతంగా పూర్తి చేసుకుని క్షేమంగా తిరిగి రావాలని, అల్లాహ్ వారి ప్రార్థనలు స్వీకరించి కుటుంబ సభ్యులకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. పవిత్ర మక్కా-మదీనా యాత్ర ప్రతి ముస్లింకు ఎంతో పవిత్రమైనది, అదృష్టప్రదమైనదని పేర్కొంటూ, సమాజ శ్రేయస్సు కోసం ప్రత్యేక దువాలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, ఆత్మీయులు, మిత్రులు పాల్గొని హజ్ యాత్రికులకు శుభాకాంక్షలు తెలియజేశారు.



# సబ్దల్పూర్‌లో గ్రామంలో పశువైద్య శిబిరం



ఎల్లారెడ్డి, మే -8(జన సంఘర్షణ )

ఎల్లారెడ్డి మండలంలోని సబ్దల్పూర్ గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పశువైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు మత్తమాల వెటర్నరీ వైద్యురాలు చెన్నంగారి అర్చనారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎల్లారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రజిత వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ... పాడి రైతులు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలని సూచించారు. అలాగే పాడి రైతులకు గడ్డి గింజలను పంపిణీ చేశారు. అనంతరం పశు వైద్యురాలు అర్చన రెడ్డి మాట్లాడుతూ... ఎండా కాలంలో పశు వుల సంక్షేమానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు విపులంగా వివరించారు. ఈ పశు వైద్య శిబిరంలో 12 చూడి పరీక్షల నిర్ధారణ, నాలుగు కృత్రిమ గర్భాధారణ, 26 జీవాలకు సాధారణ వైద్యం అందించినట్లు ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కురుమ సాయిబాబా, జేవివో అనిల్, మహబూబ్, సాయి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

# పిఎసిఎస్ కొత్తపల్లి సొసైటీ పాలకవర్గం అధికారికంగా బాధ్యతలు స్వీకరించింది

- పిఎసిఎస్ కొత్తపల్లి పాలకవర్గం బాధ్యతల స్వీకారం



కోటగిరి /మే 8/(జన సంఘర్షణ)

కోటగిరి మండల కేంద్ర పిఏసిఎస్ కొత్తపల్లి పాలకవర్గం బాధ్యతల స్వీకారం

హైకోర్టు ప్రభుత్వ ఆదేశాల మేరకు, కోఆపరేటివ్ శాఖ సూచనల ప్రకారం, శుక్రవారం మధ్యాహ్నం 12:15 గంటలకు పిఏసిఎస్ కొత్తపల్లి సొసైటీ పాలకవర్గం అధికారికంగా బాధ్యతలు స్వీకరించింది. ఈ సందర్భంగా ఇంచార్జ్ చైర్మన్‌గా డాక్టర్ వెనిగళ్ళ సునీల్ కుమార్ చౌదరి బాధ్యతలు చేపట్టగా, డైరెక్టర్లుగా పులిచెర్ల లక్ష్మారెడ్డి, గుగులోతు తుకారాం, వల్లెపల్లి శ్రీనివాసరావు, దుబాస్ కృష్ణ, సురేష్ పటేల్, బాటి నిరంజన బాయి, సుభాష్ పటేల్, శంకర్ బాధ్యతలు స్వీకరించారు. పిఏసిఎస్ కొత్తపల్లి ఇంచార్జ్ సెక్రటరీ కమలేష్, ప్రభుత్వ పర్సన్-ఇన్-చార్జ్ ఎం. పుష్ప మేడం నుండి పాలకవర్గం అధికారికంగా చార్జ్ తీసుకుంది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం పాలకవర్గం సొసైటీ కార్యాలయంలో రైతులకు సంబంధించిన ట్యాబ్ ఎంట్రీలు, ఇతర సేవలను పరిశీలించింది. రైతులకు అవసరమైన సేవలను త్వరితగతిన పారదర్శకంగా అందించాలని అక్కడున్న సిబ్బందికి ఆదేశాలు జారీ చేయడం జరిగింది. అదేవిధంగా, రైతుల పనులను ఆలస్యం చేయకుండా వెంటవెంటనే పూర్తి చేయాలని, సొసైటీ వ్యవహారాల్లో ఎటువంటి అశ్రద్ధ వహించవద్దని సిబ్బందికి సూచించడం జరిగింది. ప్రతిరోజూ పాలకవర్గం పర్యవేక్షణ కొనసాగుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు, సిబ్బంది, స్థానిక రైతులు తదితరులు, పాల్గొన్నారు.

## ద్రౌపతి సమేత ధర్మరాజు ఆలయంలో ప్రత్యేక పూజలు

కార్వేటినగరం మే 8 (జన సంఘర్షణ):




కార్వేటినగరంలో వెలసిన ద్రౌపతి సమేత ధర్మరాజుల ఆలయంలో ఉదయం ఆలయంలో స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాలు పెరుగు తేనె హరిద్రవం చందనం పసుపుతో కూడిన అభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద రాహుకాలం పూజలు, కుంకుమార్చన నిర్వహించారు. ఆలయం దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు రవి యాదవ్, ప్రధాన కార్యదర్శి గౌతమ్ రాజు, ఉపాధ్యక్షులు రవి రెడ్డి, కోశాధికారి లక్ష్మీపతి మొదలియార్, ఉప కోశాధికారి సాయి రాయల్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## శాంతి భద్రతలు పరిరక్షణకు సహకరించండి

◆ ఎస్సై వెంకట మోహన్

రామకుప్పం మే 8 (జన సంఘర్షణ)



గ్రామాల్లో శాంతి భద్రతలు పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్సై వెంకట మోహన్ కోరారు. గురువారం రాత్రి మండలంలోని భయపరెడ్లపల్లి గ్రామంలో శాంతి భద్రతలు పరిరక్షణ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మత్తు పదార్థాలకు యువకులు దూరంగా ఉండాలని కోరారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరిగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పేకాట కోళ్లు పందాలు ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరిగితే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు. అదేవిధంగా మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వారిపై ఎటువంటి దాడులు జరిగిన కఠినమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మీ భద్రత మా కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో శాంతి భద్రతలు నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారం, పరిశుభ్రతతోనే అనీమియా దూరం


కార్వేటినగరం మే 8 (జన సంఘర్షణ)



కార్వేటి నగరం మండలంలోని డిఎం పురం, సచివాలయం, సురేంద్రనగరం పంచాయతీలో అంగన్వాడి పాఠశాల యందు ఆరోగ్య మేళ, అనీమియా పై అవగాహన కార్యక్రమాన్ని ఐసిడిఎస్ సూపర్వైజర్ రోజా రమణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండడం కోసం తరచూ చేతులను శుభ్రం చేసుకుంటూ, పరిసరాలను శుభ్రంగా చూసుకోవాలని, మంచి పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా అనీమియా ను అరికట్టడానికి దృఢంగా ఆరోగ్యకరమైన కిషోరి బాలికలు, బాలురులను తీర్చిదిద్దడానికి పాలు, పండ్లు, ఆకుకూరలు గుడ్లు వంటి మొదలగు వాటిని తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హరిప్రసాద్, సిహెచ్ఓ రాజేశ్వరి, సిఆర్పి కాటవరాయన్ పవిత్ర భువనేశ్వరి,నేలవేణి,మోహన, అశ్వని, కార్యకర్తలు అమరావతి, వరలక్ష్మి, సరళ, సుధారాణి, లత, విజయ, శాంతి, కిషోరి బాలికలు పాల్గొన్నారు.

## నేడే విద్యుత్ అంతరాయం

కార్వేటి నగరం మే 8 (జన సంఘర్షణ)



కార్వేటి నగరం మండలం శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు విద్యుత్ సబ్ స్టేషన్, లెవెన్ కె.వి లైన్లు మరమ్మత్తు చేయటం జరుగుతుందని దీనికి కారణంగా విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు గమనించాలని ఏడీఈ చంద్రబాబు ఏఈ నాదముని ఒక ప్రకటనలో తెలిపారు.

## వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి పనులకు సీఎం శంకుస్థాపన





◆ కొడంగల్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన
◆ కొడంగల్‌లో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు

కొడంగల్/మే 8/ (జన సంఘర్షణ)

రాష్ట్ర ముఖ్యమంత్రి తన సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో శుక్రవారం పర్యటించారు. వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడంలో బిజీబిజీగా గడిపారు. 110 కోట్ల రూపాయలతో నిర్మాణం చేపట్టనున్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి శంకుస్థాపన చేశారు. మహా పండితులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి భూమి పూజ చేయించారు. కొడంగల్ లో 430 పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. ఈ కార్యక్రమంలో దామోదర రాజనర్సింహ, వాకటి శ్రీహరి, రామ్మోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డి, రాష్ట్ర ముఖ్యమంత్రి వెంట ఉన్నారు. దౌలతాబాద్‌లో పునర్నిర్మాణం చేపట్టనున్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భూమి పూజ చేశారు. వేద పండితులు ఆయన తలపై శిలను పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శిలను పునాదిలో పెట్టి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## తెలంగాణ ప్రభుత్వం ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా

కోటగిరి/మే 8/(జన సంఘర్షణ)





కోటగిరి మండలంలో సుద్దులం గ్రామం,పోతంగల్ మండలంలో టాక్లి గ్రామాలలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత వైద్య, గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించడం జరిగింది. శిబిరంలో 58 పశువులకు వివిధ అనారోగ్య సమస్యలకు చికిత్స చేయడం జరిగింది. అలాగే 45 దూడలకు నట్టల నివారణ మందులు త్రాగించడం, 30 జీవాలకు సాధారణ చికిత్స చేయడం జరిగింది. కార్యక్రమంలో మేలు జాతి దూడల ప్రదర్శన,పశువుల పెంపకందార్లకు వేసవి కాలంలో యాజమాన్య పద్ధతులు, పశువులకు వచ్చే వ్యాధులు, అనారోగ్య సమస్యలు, పాడి దిగుబడి, దూడల సంరక్షణ వంటి అంశాల మీద అవగాహన ఇవ్వడం జరిగింది. ప్రజాప్రతినిధులచే రైతులకు సబ్సిడీ మీద గడ్డి విత్తనాలు, ఉచిత లవణ మిశ్రమం, మందులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గాయక్వాడ్ హనుమంతు, సుద్దులం గ్రామ సర్పంచ్ గైక్వాడ్ మీనా జగన్నాథ్ రావు ఉప సర్పంచ్ జాదవ్ సుష్మిత సోఫాన్ రావు, టాక్లి గ్రామ సర్పంచి పద్మావతి, సాయికిరణ్, ఉప సర్పంచి సురేఖ, జ్యోతిపాల్ పశు వ్యాధి ప్రయోగ శాల అదనపు సహాయ సంచాలకులు డాక్టర్ కిరణ్ దేశ్ పాండే, పశువైద్యులు డాక్టర్ సురేష్ కుమార్, సిబ్బంది సుధీర్ గౌడ్, అటెండర్లు భూమేష్, సతీశ్, భాస్కర్, గోపాల మిత్రులు రాము, నగేశ్, తుకారాం, సాయిలు, పశు మిత్ర రాజేశ్, పశు పెంపకందార్లు పాల్గొన్నారు.

## వైకాపా ప్రభుత్వం దారుణాలు.. సోమిరెడ్డి విమర్శలు

◆ ప్రజాదర్బార్‌లో పాస్ పుస్తకాలు పంపిణీ చేసిన సర్వేపల్లి శాసనసభ్యులు చంద్రమోహన్ రెడ్డి.





మనుబోలు. 8.5.2026(జన సంఘర్షణ)

2023 సంవత్సరంలో రీ సర్వే పేరుతో అప్పటి వైకాపా ప్రభుత్వం దారుణాలకు పాల్పడిందని మాజీ మంత్రి సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆరోపించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశం మందిరంలో శుక్రవారం ప్రజాదర్బార్లో పాస్ పుస్తకాలు రైతులకు పంపిణీ చేసి అక్కడ జరిగిన సమావేశంలో సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రసంగించారు. రి సర్వే పేరుతో పొలాలు స్థలాలు తారుమారు చేసిందని ఇప్పుడు తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన తర్వాత రెవెన్యూ శాఖలో 70% తప్పులు సరిచేయాల్సిన పరిస్థితి వచ్చిందని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి చెప్పారు. ఇప్పుడు మళ్లీ పట్టాదార్ పాస్ పుస్తకాలు ఎందుకు పంపిణీ చేయాల్సి వస్తుందో సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి వివరించారు. వైకాపా ప్రభుత్వంలో మన తాతలు తండ్రులు సంపాదించిన పొలానికి జగన్ రెడ్డి ఫోటో పెట్టుకున్నాడని గుర్తు చేశారు.వాటిని తొలగించి ప్రభుత్వ రాజముద్రతో మళ్ళీ పాస్ పుస్తకాలు ఇవ్వాల్సిన పరిస్థితి వచ్చిందని తెలిపారు. పొదలకూరు మండలంలో పార్లపల్లి మహమదాపురం గ్రామాలలో 22ఏ పేరుతో భూములను వైకాపా ప్రభుత్వంలో అప్పటి మంత్రి గందరగోళం చేసి పెట్టాడని ఆరోపించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇలాంటి వాటిపైన టోటల్గా సర్వే చేసి ఎవరైతే భూమిలో ఉండి సాగు చేసుకుంటున్నారో వాళ్లకు పాస్ పుస్తకాలు ఇచ్చే విధంగా నిర్ణయం తీసుకున్నాడు అని తెలిపారు. ఇలాంటి దారుణాలన్నీ అప్పటి వైకాపా ప్రభుత్వం చేసిందని విమర్శించారు పది లక్షల భూమి కొని 30 లక్షల రూపాయలు జగన్ ప్రభుత్వం మోసాలకు పాల్పడిజగనన్న కాలనీ పేరు అక్రమాలుకు పాల్పడారని ఆరోపించారు. జగన్ ప్రభుత్వం వల్ల పేదలు రైతులు ఇబ్బంది పడ్డారని గుర్తు చేశారు. అప్పటి వైకాపా ప్రభుత్వంలో డ్రిప్ ఇరిగేషన్ యాంత్రికరణ ఆపేశారని తెలిపారు. తాను వ్యవసాయ మంత్రిగా ఉన్నప్పుడు రోటో వేటర్లు బట్టలుస్ప్రెయిర్లు. పట్టలు రైతు రథాలు పంపిణీ చేశానని తెలిపారు. తాను వ్యవసాయ మంత్రిగా ఉన్న సమయంలో 23,500 రైతు రథాలను పంపిణీ చేశానని అది ఒక చరిత్రని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి చెప్పకొచ్చారు. వైకాపా ప్రభుత్వంలో మూడు దపాలు 6500 రైతు భరోసా నిధులు రైతుల ఖాతాలో జమ చేస్తే మా ప్రభుత్వంలో 14,500 కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 6500. రూ 20 వేల మొత్తం రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు సోమిరెడ్డి చెప్పారు రెండో పంట విషయంలో సోమిరెడ్డి జాగ్రత్తలు చెప్పారు. ఎలినినా ఎండల ప్రభావం తీవ్రంగా ఉంటుందని రైతులు జాగ్రత్తగా ఉండాలని గుర్తు చేశారు. ముందుగా ఎమ్మెల్యే సోమిరెడ్డి పార్టీ కార్యాలయానికి రాంగానే పార్టీ నాయకులు, అధ్యక్షులు పచ్చిపాల రాంరెడ్డి ఆధ్వర్యంలో కొమ్మలపూడి టిడిపి నేత మన్నె మల భాస్కర్ రెడ్డి, ఏ దామోదర్ రెడ్డి, తెలుగు యువత అధ్యక్షులు శివుడు, రాజా గౌడు, మనుబోలు టౌన్ మాజీ అధ్యక్షులు సాని వెంకటరమణయ్య, శాలువాలు కప్పి స్వాగతం పలికారు. ఈ ప్రజాదర్బార్లో గురివిందపూడి కొమ్మలపూడి చెరుకుమూడి గ్రామ రైతులకు ఎమ్మెల్యే పాస్ పుస్తకాలను పేరుపేరునరైతులు ను పిలిచి అందజేశారు. అదే సమయంలో ప్రజాదర్బార్లో వివిధ సమస్యల పైన అర్జీలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జలజాక్షి డిటి ప్రదీప్ కుమార్ మనుబోలు టిడిపి అధ్యక్షులు పొన్నూరు రామకృష్ణయ్య మనుబోలు నీటి సంఘ అధ్యక్షులుపచ్చి పాల రామిరెడ్డి, టిడిపి సీనియర్ నేతబొమ్మి సురేంద్ర, డిప్యూటీ ఎంపీడీవోలు గరుడయ్య పాల్గొన్నారు.

# బంగారు దుకాణాలలోని డిజిటల్ తూకం మిషన్లను తనిఖీ చేసిన అధికారులు




**సూళ్లూరుపేట మే 8 2026 జన సంఘర్షణ :** తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో అసిస్టెంట్ కంట్రోలర్ లీగల్ మెట్రాలజీ టీం స్వామి ఆధ్వర్యంలో బంగారు షాపులను ఆకస్మిక తనిఖీ చేశారు. బంగారం కొనుగోలు, అమ్మకాల లావాదేవీలు, బిల్లుల నిర్వహణ, రిజిస్టర్ వివరాలు, వినియోగదారుల రికార్డులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీలలో వ్యాపారులు ఉపయోగిస్తున్న డిజిటల్ తూకం మిషన్ల వినియోగం లోపాలను తనిఖీ చేసి యజమానులకు అవగాహన కల్పించారు. అనుమానాస్పద లావాదేవీలు, సరైన పత్రాలు లేకుండా జరుగుతున్న కొనుగోళ్లపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. కొన్ని దుకాణాల్లో కొనుగోలు బిల్లులు, జీఎస్టీ రికార్డులు, పాత బంగారం మార్పిడి వివరాలను అధికారులు తనిఖీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని లీగల్ మెట్రాలజీ డిపార్ట్మెంట్ అధికారులు హెచ్చరించారు. ఈ ఆకస్మిక తనిఖీలు సూళ్లూరుపేట పట్టణంలోని అన్ని బంగారం దుకాణాలలో నిర్వహించడం జరుగుతుందని, ఈరోజు బంగారు షాపు మూసి వేసినా మళ్లీ ఏదో ఒక రోజు కచ్చితంగా తనిఖీ చేయడం జరుగుతుందని అధికారులు తెలియజేశారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి తనిఖీలు కొనసాగుతాయని, వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని విజిలెన్స్ అధికారులు సహకరించాలని తెలిపారు.

# ఇంటి తాళాలు వేసి దొంగతనాలకు పాల్పడిన నిందితుడి అరెస్ట్

- **రూ.18 లక్షల 50 వేల నగదు, 126 గ్రాముల బంగారు ఆభరణాల స్వాధీనం.**
- **ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తిరుపతి జిల్లా పోలీసుల విజ్ఞప్తి.**



**తిరుపతి/ మే 08/ జన సంఘర్షణ :** తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా పోలీసులు ఇంటి తాళాలు వేసి ఉన్న సమయంలో దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని అరెస్ట్ చేసి, భారీ మొత్తంలో నగదు, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి క్రైమ్ పోలీస్ స్టేషన్ నందు అదనపు ఎస్పీ (క్రైమ్స్) వివరాలు వెల్లడించారు. ఈ కేసులో నిందితుడు నెహ్రూ నగర్ తిరుపతికి చెందిన ఉల్కేష్, (27)గా గుర్తించారు. నిందితుడు గత కొంతకాలంగా విలాసాలకు బానిసై, తిరుపతి నగర పరిసర ప్రాంతాల్లో ఇంటి యజమానులు బయటకు వెళ్లిన సమయాలను గమనించి, తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైంది. పోలీసులు సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీలు, అనుమానితుల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు 2024 సంవత్సరంలో తిరుపతి నగర పరిధిలో మొత్తం ఆరు చోరీ కేసులకు పాల్పడినట్లు అంగీకరించాడు. నిందితుడి వద్ద నుంచి మొత్తం రూ.18,50,000 నగదు, సుమారు 126.135 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. వీటిలో బంగారు గొలుసులు, ఉంగరాలు, బంగారు చైన్లు, లక్ష్మీ డాలర్ చైన్, చెవిపోగులు, ఇతర బంగారు వస్తువులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, నిందితుడిని న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. దర్యాప్తు కొనసాగుతోందని, ఈ నేరాలకు సంబంధించి మరిన్ని వివరాలను సేకరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన అధికారులను జిల్లా ఎస్పీ అభినందించారు. ముఖ్యంగా అదనపు ఎస్పీ (క్రైమ్స్) పర్యవేక్షణలో సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది సమన్వయంతో వేగంగా దర్యాప్తు నిర్వహించి కేసును విజయవంతంగా ఛేదించారు. ప్రజలు తమ ఇళ్లను కొంతకాలం ఖాళీగా వదిలి వెళ్లే సందర్భాల్లో పొరుగువారికి సమాచారం ఇవ్వడం, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం లేదా పోలీసువారికి సమాచారం ఇచ్చిన ఎల్ హెచ్ ఎం ఎస్ కెమెరాలను ఉచితంగా ఏర్పాటు చేస్తామని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 112 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని తిరుపతి జిల్లా పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# గంజాయి మత్తుగాళ్లపై పోలీసుల 'సర్జికల్ స్ట్రైక్'

- **అత్యాధునిక కిట్లతో రంగంలోకి 'సూళ్లూరుపేట' పోలీసులు!**
- **తనిఖీల్లో ముగ్గురికి పాజిటివ్.. గంజాయి బ్యాచ్ గుండెల్లో వణుకు పుట్టిస్తున్న 'నయా టెస్టింగ్'**
- **జిల్లాను గంజాయి రహితంగా మార్చడమే లక్ష్యం - జిల్లా ఎస్పీ హెచ్చరిక.**


**సూళ్లూరుపేట, మే 8 జన సంఘర్షణ :** నియోజకవర్గంలో యువత భవిష్యత్తును చిదిమేస్తున్న గంజాయి మహమ్మారిని వేళ్లతో సహా పెకిలించేందుకు పోలీస్ యంత్రాంగం సరికొత్త అస్త్రాలను సిద్ధం చేసింది. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సూళ్లూరుపేట, తడ ప్రాంతాల్లో పోలీసులు అత్యాధునిక 'డ్రగ్ టెస్టింగ్ కిట్లతో' మెరుపు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో గంజాయి సేవిస్తున్న ముగ్గురు వ్యక్తులు పోలీసులకు అడ్డంగా దొరికిపోయారు.

**అత్యాధునిక పరిజ్ఞానంతో చెక్**

నాయుడుపేట డీఎస్పీ సెంచు బాబు పర్యవేక్షణలో, సీఐ మురళీకృష్ణ నేతృత్వంలో పోలీసులు శుక్రవారం రాత్రి ముమ్మర తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా కనిపించిన తొమ్మిది మందికి ఈ నూతన కిట్ల ద్వారా పరీక్షలు నిర్వహించగా, అందులో ముగ్గురికి పాజిటివ్ అని తేలింది. ఇంతకుముందు కేవలం పట్టుకుంటే తప్ప తెలిసేది కాదని, కానీ ఇప్పుడు ఈ కిట్ల ద్వారా సెకన్ల వ్యవధిలో గంజాయి సేవించినట్లు నిర్ధారణ అవుతుందని సీఐ తెలిపారు.

**మూలాలను వెతికి తీస్తాం:**

ఈ సందర్భంగా సీఐ మురళీకృష్ణ మాట్లాడుతూ.. గంజాయి అమ్మే వారి కంటే, కొనే వారి ద్వారా అసలు నెట్‌వర్క్‌ను ఛేదిస్తామని స్పష్టం చేశారు. పట్టుబడిన వ్యక్తుల ద్వారా వీరికి గంజాయి ఎక్కడి నుంచి వస్తుంది? ఎవరు సరఫరా చేస్తున్నారు? అనే కోణంలో లోతైన దర్యాప్తు జరుపుతున్నట్లు చెప్పారు. తిరుపతి జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు పోలీసు శాఖ దృఢ సంకల్పంతో ఉందని, ఎవరైనా గంజాయి సరఫరా



చేసినా లేదా సేవించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

యువతకు విజ్ఞప్తి:

క్షణికానందం కోసం మత్తుకు బానిసలై జీవితాలను పాడు చేసుకోవద్దని, తల్లిదండ్రుల ఆశలను అడియాశలు చేయవద్దని పోలీసులు హితవు పలికారు. గంజాయి సమాచారం తెలిసిన వారు భయం లేకుండా పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తడ, సూళ్లూరుపేట ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సోమిరెడ్డి తాత దిగి రావాలి

**నెల్లూరు జిల్లా- జన సంఘర్షణ :** నెల్లూరు జిల్లా కోర్టుకు సాయంత్రం 4 గంటల సమయంలో హాజరైన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి. సోమిరెడ్డి అక్రమాస్తులను కలిగి ఉన్నాడంటూ ఆరోపణలు చేసిన నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని 2017లో కాకాణి పై నమోదైన కేసు విషయంలో నాలుగవ అదనపు జ్యూడిషియల్ మ్యాజిస్ట్రేట్ కోర్టుకు హాజరైన కాకాణి. కేసును తదుపరి విచారణ నిమిత్తం ఎమ్మెల్యే, ఎంపీలకు, చెందిన ప్రత్యేక న్యాయస్థానానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన కోర్ట్. సోమిరెడ్డి కి ఇతర దేశాల్లో అక్రమ ఆస్తులు ఉన్నట్టు కాకాణి మీడియా సమావేశంలో వెల్లడించిన విషయం తెలిసిందే. సోమిరెడ్డి తనకు అక్రమ ఆస్తులు లేవని నిరూపించుకోలేక 2017 వ సంవత్సరంలో కాకాణి పై తప్పుడు కేసు బనాయించడం జరిగింది. కేసు పూర్వాపరాలు పరిశీలించిన నాటి పబ్లిక్ ప్రాసిక్యూటర్ లు, కేసుకు విచారణ అర్హత లేదని ప్రభుత్వానికి నివేదించి, కేసును తీసివేయాలంటూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. కోర్టులో కేసు ఎత్తివేసే విషయంలో తర్జనభర్జనలు జరుగుతున్న



క్రమంలో కేసుకు సంబంధించిన ఫైళ్లు దొంగతనానికి గురికావడం జరిగింది. సోమిరెడ్డి పదే పదే కోర్టులో ఫైళ్ల గల్లంతు విషయమై కాకాణి పాత్ర ఉన్నట్లు రకరకాల కథనాలు వినిపించడం జరిగింది. కోర్టులో ఫైళ్ల మిస్సింగ్ కేసులో ఉన్నత న్యాయస్థానం సిబిఐ విచారణ జరిపి నిజానిజాలు నిగ్గు తేల్చాల్సిందిగా ఆదేశించడం జరిగింది. సుమారు సంవత్సరం కాలం పాటు సిబిఐ విచారణ చేపట్టి చివరకు కాకాణి కి కోర్టు లో ఫైళ్ళ మిస్సింగ్ కేసులో క్లీన్ చిట్ ఇవ్వడం జరిగింది. పచ్చ పత్రికలు ఈనాడు, ఆంధ్రజ్యోతి, పచ్చ చానళ్లు, ఏబీఎన్, టీవీ 5, ఈటీవీ, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున కాకాణి ముద్దాయిగా ఉన్న కోర్టు ఫైళ్ల మిస్సింగ్ కేసు వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం దర్యాప్తు జరిపితే న్యాయం జరగదని, సిబిఐ చేత దర్యాప్తు చేయించాలని పుంఖాను, పుంఖాలు గా వార్తా కథనాలు రాయడం, ప్రసారం చేయడం జరిగింది. సుదీర్ఘ కాలం సీబీఐ విచారణ చేపట్టి చివరకు కాకాణి కి సంబంధం లేదంటూ క్లీన్ చిట్ ఇవ్వడంతో సిబిఐ విచారణ సరిగ్గా జరగలేదంటూ, పచ్చ మీడియా సాక్షాత్తు సిబిఐ దర్యాప్తు పైనే అనేక అనుమానాలు వ్యక్తం చేస్తూ, వార్తా కథనాలు వండి వార్చడం జరిగింది. పచ్చ మీడియా మొదట సిబిఐ చేత విచారణ జరిపించాలని పదే పదే పేర్కొని, సిబిఐ విచారణ జరిపి, క్లీన్ చిట్ ఇచ్చిన పిదప, సిబిఐ పైనే ఆరోపణలు చేయడం గమనర్హం. కాకాణి కోర్టుకు హాజరైన నేపథ్యంలో నెల్లూరు జిల్లా కోర్టులోని లాయర్లు విచ్చేసి, కాకాణి వెంట కోర్టు హాల్ లోకి ప్రవేశించడం జరిగింది. తప్పుడు కేసులకు భయపడే ప్రసక్తే లేదని, సోమిరెడ్డి గాని, సోమిరెడ్డి తాత దిగి వచ్చినా కాకాణి పై చేసిన తప్పుడు ఆరోపణలు రుజువు చేయడానికి సాధ్యం కాదని కాకాణి అనుచరులు ధీమా వ్యక్తం చేశారు. కాకాణి కోర్టుకు రానున్నారని తెలిసి పచ్చ మీడియా ఉదయం 10నుండి సాయంత్రం 5గంటల వరకు తిండి, తిప్పలు లేక, పడిగాపులు కాయడాన్ని చూసి ' ఇదేమి కర్మ రా బాబు' అంటూ హేళనగా నవ్వుకుంటూ మాట్లాడుకున్న న్యాయవాదులు, కోర్టుకు విచ్చేసిన కక్ష దారులు.

# నంద్యాల సబ్ డివిజనల్ స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుల నియామకం



**నంద్యాల జన సంఘర్షణ : మే 8..** నంద్యాల సబ్ డివిజనల్ స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా ప్రముఖ బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సిరివెళ్ల మండలం గంగవరం గ్రామంనకు చెందిన వై.నాగ శేషు నియమితులయ్యారు. ఈ మేరకు శు క్రవారం 11:30 గంటల సమయం నందు నంద్యాల రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్.డి.ఓ), సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ సి. విశ్వనాథ్ సార్ చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా వై.నాగశేషు మాట్లాడుతూ ..తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. సబ్ డివిజన్ పరిధిలోని పౌర హక్కుల పరిరక్షణకు, ప్రభుత్వ నిబంధనల మేరకు ఉల్లంఘించకుండా క్రమశిక్షణతో అమలు చేయుటకై అధికారుల సూచనల మేరకు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా సేవలందిస్తున్న వై నాగశేషు కమిటీ సభ్యునిగా ఎంపిక కావడం పట్ల పలు ప్రజాసంఘాలు బీసీ విద్యార్థి సంఘాలు, వివిధ దళిత సంఘాలు మిత్రులు, ఆత్మీయులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# రోడ్డు ప్రమాదంలో మృతుని కుటుంబానికి 5 లక్షల చెక్కును పంపిణీ చేసిన గంధమనేని

- **కార్యకర్త బీమాతో ఆ కుటుంబానికి భరోసా...**



**జన సంఘర్షణ :** చిత్తూరు జిల్లా ఎస్ఆర్ పురం మండలం ఆరిమాకుల పల్లె దళితవాడకు చెందిన బాలకృష్ణ రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. అతనికి తెలుగుదేశం పార్టీ సభ్యత్వం కలిగి ఉండడంతో ఎమ్మెల్యే డాక్టర్ థామస్ సహకారంతో బాలకృష్ణన్‌కు ఐదు లక్షల బీమా చెక్కు వచ్చింది. దీనిని ఎస్ఆర్ పురం మండల పార్టీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు బాలకృష్ణన్ భార్య కుతూహలమ్మకు అందించారు . ఈ సందర్భంగా కుతూహలమ్మ మాట్లాడుతూ.. నా భర్త రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు నా భర్త సభ్యత్వం బీమా ఐదు లక్షలు రావడానికి కృషిచేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి, మంత్రి లోకేష్‌కి, ఎమ్మెల్యే డాక్టర్ థామస్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా కుతూహలమ్మ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని కుతూహలమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘ చైర్మన్ నిరంజన్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి వెంకటాచలం, సుబ్రహ్మణ్యం నాయుడు, రఘు నాయుడు, వేణు, బాలాజీ, రవి, శ్రీరాములు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలో నేడు 5 గంటలపాటు విద్యుత్ అంతరాయం



**సూళ్లూరుపేట మే 8 2026 జన సంఘర్షణ :** సూళ్లూరుపేట పట్టణంలోని మన్నేముత్తూరి సబ్ స్టేషన్ పరిధిలో నేడు శనివారం విద్యుత్ లైన్లు, ట్రాన్స్ఫార్మర్ల మరమ్మతులు చేపట్టనున్నారు. ఈ కారణంగా ఉదయం ఎనిమిది గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఇసకమెట్ట కోళ్ల మిట్ట బాపూజీ కాలనీ రాఘవైపేట సార్ బస్టాండ్ దేగల పాలెం కసారెడ్డిపాలెం వంటి ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ డి ఈ ఆర్ శేఖర్ తెలిపారు. వినియోగదారులు సహకరించవలసిందిగా ఆయన కోరారు. చెంగాలమ్మ సబ్ స్టేషన్ పరిధిలోని పడమటి వైపు ప్రాంతంలోని ఎలాంటి అంతరాయం ఉండబోదని ఆయన స్పష్టం చేశారు.

# రాగిమానుపెంట విద్యార్థులకు కంప్యూటర్ స్పోకెన్ క్లాస్ ప్రారంభించిన టిడిపి యువ నాయకుడు ఎన్నారై ఎన్.పి.విక్రమ్

- **నేషనల్ హ్యూమన్ రైట్స్ సెక్రటరీ మదన్.బి ఆధ్వర్యంలో**



**బంగారుపాలెం మే 8 జన సంఘర్షణ :** బంగారుపాళ్యం మండలంలోని రాగిమానుపెంట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థుల నాలెడ్జ్ కోసం నలగాంపల్లి గ్రామానికి చెందిన టిడిపి యువ నాయకులు ఎన్నారై ఎన్.పి. విక్రమ్ కంప్యూటర్‌లు, పుస్తకాలు పంపిణీ చేశారు. చుట్టుపక్కల గ్రామస్తుల పిల్లలు కూడా వచ్చి కంప్యూటర్స్ నేర్చుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమం నేషనల్ హ్యూమన్ రైట్స్ సెక్రటరీ మదన్.బి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామినేని బాలకృష్ణ నాయుడు, మాజీ సింగల్ విండో చైర్మన్ నాగరాజు నాయుడు, బెజవాడ నవీన్, దుర్గా చౌదరి,విక్రమ్, అభిరామ్, సాయి, రాగిమానుపెంట యూత్ అండ్ రాగిమానుపెంట గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్...

**ధాన్యం కొనుగోలులో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలి....**

**జిల్లా కలెక్టర్ అంకిత్...**

**సుజాతనగర్ :**

సుజాతనగర్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ను ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలు, కొనుగోలు ప్రక్రియపై సమగ్రంగా ఆరా తీశారు.మొదటగా సుజాతనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలను సమగ్రంగా పరిశీలించారు. ఔట్ పేషెంట్ విభాగం, ఇన్ పేషెంట్ విభాగం, మందుల గది, సిబ్బంది హాజరు నమోదు పత్రాలు, ఔట్ పేషెంట్ రిజిస్టర్ను పరిశీలించి రోజువారీగా నమోదవుతున్న కేసుల వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు.రక్తపరీక్షలు, ఇతర నిర్ధారణ పరీక్షల నిర్వహణ, ల్యాబ్ సేవల పరిస్థితి, పరీక్షల ఫలితాలను రోగులకు సమయానికి అందిస్తున్న విధానంపై ఆరా తీశారు. మందుల నిల్వ గదిని పరిశీలించి అందుబాటులో ఉన్న మందుల స్టాక్, అవసరమైన మందుల లభ్యత, రికార్డుల నిర్వహణను తనిఖీ చేశారు.ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వార్డులు, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలను ఎప్పటికప్పుడు శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రోగులకు పరిశుభ్రమైన వాతావరణంలో మెరుగైన వైద్య సేవలు అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, రోగులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని తెలిపారు.అనంతరం సుజాతనగర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియ, నిల్వలు, రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలు, రవాణా ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో నిల్వ ఉన్న ధాన్యం, మొక్కజొన్న నిల్వల వివరాలను పరిశీలించి కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి జాప్యం చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ధాన్యం తేమ శాతాన్ని స్వయంగా పరిశీలించి నాణ్యత ప్రమాణాలపై ఆరా తీశారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసి కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని, రైతులు రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల వద్ద వేచి ఉండే పరిస్థితి రాకుండా చూడాలని



సూచించారు.కొనుగోలు కేంద్రానికి వచ్చిన రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.మొక్కజొన్న తరలింపునకు తగినన్ని లారీలు అందుబాటులో లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.లోడింగ్, రవాణా సమస్యల కారణంగా మొక్కజొన్న కేంద్రంలోనే నిల్వ ఉండిపోతుందని వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ వెంటనే తగినన్ని లారీలు ఏర్పాటు చేసి రవాణా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.పి.ఆర్-126 రకం ధాన్యంలో "పిన్ పాయింట్ డ్యామేజ్" ఉన్నదనే కారణంతో రైస్ మిల్లర్లు ధాన్యాన్ని స్వీకరించడం లేదని రైతులు వివరించగా, దీనిపై రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. రైతుల ధాన్యం ఎక్కడా నిల్వ ఉండకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.రైతులు ఎంతో శ్రమించి పండించిన ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైనన్ని గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు, తాగునీరు, తేమ కొలిచే పరికరాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ధాన్యం తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు.కొనుగోలు కేంద్రాల్లో అధికారులు నిరంతరం అందుబాటులో ఉండి రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ధాన్యం రవాణా, నిల్వ,





లోడింగ్ తదితర అంశాలలో సమన్వయంతో పనిచేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, ఎంపీడీవో భారతి, వైద్య అధికారులు డాక్టర్ రమేష్ కొనుగోలు కేంద్రం అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన సినీ నటుడు శ్రీకాంత్



**కుత్బుల్లాపూర్ :**

కుత్బుల్లాపూర్ నియోజవర్గం షాపూర్ నగర్ డివిజన్ పరిధిలో గురువారం పంబి శ్రీనివాస్ నాయి కుమారుడు వివాహానికి హాజరు కాలేకపోయినా సినీ నటుడు శ్రీకాంత్ స్వయంగా ఇంటికి వచ్చి నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా సినీ నటుడు శ్రీకాంత్ మాట్లాడుతూ పంబి శ్రీనివాస్ తో నాలుగు దశాబ్దాల స్నేహ బంధాశీ కాస్త బిజీ షెడ్యూల్ ఉండడం కరణం వల్ల వివాహానికి రాలేకపోయినా అని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్, నవీన్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మోడీ పర్యటనను అడ్డుకుంటాం : ఏఐవైఎఫ్




**ఉప్పల్ :**

ప్రధాని నరేంద్ర మోడీ మే 10న తెలంగాణ పర్యటనకు వస్తున్న సందర్భంగా నిరుద్యోగులు, ప్రజలు పెద్దఎత్తున నిరసనలకు సిద్ధం కావాలని ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్ పిలుపునిచ్చారు. మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఈసీఐఎల్లోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని, రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన కేంద్ర ప్రభుత్వం యువతకు ఉపాధి కల్పించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా నిరుద్యోగ సమస్య తీవ్రరూపం దాల్చి యువత ఆత్మహత్యలకు పాల్పడుతున్న పరిస్థితి ఏర్పడిందన్నారు.రైల్వే రిక్రూట్మెంట్ బోర్డు ఫలితాలను సంవత్సరాలుగా విడుదల చేయకపోవడం వల్ల లక్షలాది మంది అభ్యర్థులు నిరీక్షణలో ఉన్నారని తెలిపారు. నాన్ టెక్నికల్ పాపులర్ కేటగిరీస్, గ్రూప్-డి, జూనియర్ ఇంజనీర్, టెక్నీషియన్ పోస్టుల ఫలితాలు పెండింగ్లో ఉండటం కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు.రైల్వేలో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, పోస్టుల తగ్గింపు నిర్ణయాన్ని రద్దు చేయాలని, పెండింగ్ ఫలితాలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు విధానాన్ని నిలిపివేసి శాశ్వత ఉద్యోగాలు కల్పించాలని, రైల్వే శాఖను ప్రైవేటీకరణ నుంచి రక్షించాలని కోరారు.ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సల్మాన్ బిగ్, జిల్లా ఉపాధ్యక్షుడు గిరిబాబు, నాయకులు సురేష్, అర్జున్, అమర్ తదితరులు పాల్గొన్నారు.

# కాచాపూర్ లో ఉచిత పశు వైద్య శిబిరం

**పశువుల డాక్టర్ మాధవరావు**

**శంకరపట్నం :**

ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో బాగంగా పశు సంవర్ధక శాఖ అద్వర్యంలో వెటర్నరీ డాక్టర్ మాధవరావు శుక్రవారం కాచాపూర్ గ్రామంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ శ్రీమతి మాధవి మధుకర్ ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమం ప్రారంభించారు ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీమతి మాధవి మధుకర్ మాట్లాడుతూ పశువులకు గాలికుంటు (ఎఫ్ ఎం డి ), బ్రూసెలోసిస్, గొంతువాపు, చిటుక రోగం వంటి ప్రాణాంతక వ్యాధుల నివారణకు ఉచిత టీకాలను పశువుల వైద్యాధికారిని సంప్రదించి



వేయించుకోవాలన్నారు. ముఖ్యంగా, ఆరు నెలలకు ఒకసారి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి. మరియు 4-5 నెలల వయసున్న ఆవు దూడలకు బ్రూసెలోసిస్ టీకాలు తప్పనిసరిగా వేయించాలన్నారు.ఈ సందర్భంగా 83 పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ చికిత్సలు, 23 దూడలకు



నట్టల నివారణ మందులు, ఖనిజ మిశ్రమం పంపిని చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతులుసిబ్బంది సందీప్, అమీర్ ఖాన్, అజహర్, గోపాలమిత్రలు మొండయ్య, శ్రీనివాస్, సంపత్ తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు.

# రైల్వేల్లో ఉద్యోగాల కోతలు - మోడీ ప్రభుత్వ కార్పొరేట్ కుట్ర

- **యువత భవిష్యత్తును నాశనం చేస్తూ, రైల్వేలను ప్రైవేటీకరణ దిశగా నెట్టివేత**
- **ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రైల్ నిలయం వద్ద నిరసన ధర్నా**
- **రైల్వే జీయంకు ఏఐవైఎఫ్ బృందం వినతి**
- **ఏఐవైఎఫ్**
- **రాష్ట్ర అధ్యక్షుడు,ప్రధాన కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ,కల్లూరు ధర్మేంద్ర**




భారత రైల్వే బోర్డు ఏప్రిల్ 26న ప్రకటించిన మానవశక్తి హేతుబద్దీకరణ "Manpower Rationalisation 2026--27" పేరుతో 2% పోస్టుల తగ్గింపు (సుమారు 29,608 పోస్టులు) నిర్ణయం సాధారణ పరిపాలనా చర్య కాదని, ఇది దేశ యువతపై నేరుగా చేసిన దాడి అని , ప్రజా రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించే కుట్రలో భాగమని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ తీవ్రంగా ఆరోపిస్తోంది. రైల్వే బోర్డ్, కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ AIYF జాతీయ సమితి పిలుపులో భాగంగా ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో సికింద్రాబాద్ లోని రైల్ నిలయం వద్ద నిరసన ధర్నా నిర్వహించారు, అనంతరం సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ కు ఏఐవైఎఫ్ బృందం వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ,కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ రైల్వేలో మొత్తం 14,80,455 పోస్టులు ఉంటే, ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బంది సుమారు 10 లక్షలు మాత్రమే వున్నారని, ఖాళీలు 3--4 లక్షల పోస్టులు ఉన్నాయని, రైల్వే బోర్డ్ తీసుకున్న ప్రస్తుత నిర్ణయంతో 2% ఉద్యోగాల కోత (29,608 పోస్టులు) తగ్గుతాయన్నారు. ఇప్పటికే లక్షల సంఖ్యలో ఖాళీలు ఉన్నప్పటికీ వాటిని భర్తీ చేయకుండా, మరోవైపు ఉద్యోగాలను తగ్గించడం అంటే ఇది స్పష్టమైన ఉద్యోగ వ్యతిరేక విధానం అని వారు విమర్శించారు. "Rationalisation" పేరుతో ఉద్యోగాల నిర్మూలన, కొత్త నియామకాలను నిలిపివేయడం, ప్రభుత్వ ఉద్యోగాలను క్రమంగా తగ్గించడం, కార్పొరేట్ ప్రైవేట్ కాంట్రాక్టర్లకు మార్గం సుగమం చేయడమేనని వారు ఆరోపించారు. ఇది సంస్కరణ కాదని, ప్రైవేటీకరణ కుట్రలో భాగమేనని వారు ఏద్దేవా చేశారు. ఇది సామర్థ్యం కాదని, ఇది ఉద్యోగాల నరమేధంతో పోలుస్తున్నామన్నారు. రైల్వే శాఖలో ఇప్పటికే కీలక విభాగాలు తీవ్రమైన ఒత్తిడిలో ఉన్నాయని, లోకో పైలట్లు, మెయింటెనెన్స్ సిబ్బంది, సిగ్నలింగ్ సిబ్బంది, టెక్నికల్ వర్కర్స్ ఎక్కువ పని గంటలు పనిచేస్తున్నారని, తక్కువ సిబ్బంది వలన తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉద్యోగాల కోత, భద్రతపై ముప్పు, ప్రజల ప్రాణాలతో ఆట ఇది మోడీ ప్రభుత్వ నినాదమని వారు ఉద్ఘటించారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ "ప్రతి సంవత్సరం 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం-ఇప్పుడు 2% ఉద్యోగాల కోతలు ఎందుకు?" ఇదేనా యువతకు ఇచ్చిన హామీ? ఇదేనా అభివృద్ధి? ఇదేనా నూతన భారత్? అని వారు ప్రశ్నించారు.రెండు సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న ఆర్ఆర్బీ RRB అభ్యర్థుల నాన్ టెక్నికల్ పాపులర్ కేటగిరిస్ (NTPC), Group-D,జూనియర్ ఇంజనీర్ (JE), Technician ఫలితాలు పెండింగ్ వలన లక్షల మంది యువత నిరీక్షణలో వున్నారని,కేంద్ర ప్రభుత్వం స్పందన లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు.అందుకే ఏఐవైఎఫ్ కేంద్ర ప్రభుత్వం ను రైల్వేలోని అన్ని ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, 2% పోస్టుల తగ్గింపు నిర్ణయాన్ని వెంటనే రద్దు చేయాలని, అన్ని పెండింగ్ RRB ఫలితాలను తక్షణమే విడుదల చేయాలని, కాంట్రాక్టు విధానాన్ని నిలిపివేసి శాశ్వత ఉద్యోగాలు ఇవ్వాలని, రైల్వే శాఖను ప్రైవేటీకరణ నుండి రక్షించాలని లేనియెడల యువతను పెద్ద ఎత్తున సమీకరించి ఉద్యమిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నేర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి. సత్య ప్రసాద్, శ్రీమాన్, రాష్ట్ర కోశాధికారి పేరబోయిన మహేందర్, రాష్ట్ర సమితి సభ్యులు షేక్ మహమూద్, సల్మాన్ బేగ్, ఎల్లంకి మహేష్, శేఖర్, మధుకర్, రాజ్ కుమార్, మెస్రం భాస్కర్, ఆంజనేయులు, చారి, అజీమ్, భరత్, అలీ, కిరణ్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# దివంగత ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డికి ఘన నివాళి



**చిల్కానగర్ :**
ఉప్పల్ నియోజకవర్గ తొలి ఎమ్మెల్యే దివంగత బండారి రాజిరెడ్డి వర్ధంతి సందర్భంగా బీరప్ప గడ్డ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో బ్యాంక్ కాలనీలోని పార్టీ కార్యాలయంలో రాజిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ మాట్లాడుతూ దివంగత బండారి రాజిరెడ్డి ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుని పీడిత ప్రజల పక్షాన ఎల్లప్పుడూ నిలిచిన నిజమైన ప్రజానాయకుడని కొనియాడారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి అంకితభావంతో సేవలందించారని పేర్కొన్నారు. ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేతకు పార్టీలకతీతంగా నాయకులు నివాళులర్పించడం ఆయనపై ఉన్న అభిమానానికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎద్దుల కొండల్ రెడ్డి, కొక్కొండ జగన్, మాస శేఖర్, అశోక్ చారి, బాలకృష్ణ గౌడ్, సదానంద చారి, యాదగిరి, పోచయ్య, రమేష్, మార్కా శీను, ఆజాద్, శ్యామ్ రజక, బంటి గౌడ్, బీరప్ప గడ్డ బాలు, నరసింహ చారి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ కార్పొరేషన్ రుణాల ఎంపిక

- 167 మందికి గాను 135 మంది హాజరు
- పారదర్శకంగా లబ్ధిదారుల ఇంటర్వ్యూలు
- వంశీధర్





**మదుగులపల్లి:**
మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎస్సీ కార్పొరేషన్ రుణాల (2025-26) కేటాయింపు కోసం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ నిర్వహించారు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) వంశీధర్ అధ్యక్షతన, మండల స్థాయి కమిటీ మరియు వివిధ బ్యాంక్ మేనేజర్ల సమక్షంలో ఈ ఇంటర్వ్యూలు సాగాయి మండలంలోని 28 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 167 మంది అభ్యర్థులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోగా, నేడు నిర్వహించిన ముఖాముఖి ఇంటర్వ్యూలకు 135 మంది హాజరయ్యారు ఈ సందర్భంగా అధికారులు దరఖాస్తుదారుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి, వారు చేపట్టబోయే స్వయం ఉపాధి యూనిట్లపై ఆరా తీశారు ప్రభుత్వం అందించే సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని అధికారులు ఈ సందర్భంగా సూచించారు ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్ సరోజ పావని, ఎంపీఓ సంగీత, ఆర్ఐ శ్యామ్, జిపిఓ శ్రీనివాస్ వివిధ బ్యాంకుల మేనేజర్లు మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

# కాణిపాకం హుండీ ద్వారా 1,58,76,947 ఆదాయం



**కాణిపాకం మే 8**
కాణిపాకంస్వయంభు వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం ఆస్థాన మండపంలో శుక్రవారం జరిగిన హుండీ లెక్కింపు ద్వారా 1,58,76,947 బంగారం 37 గ్రాములు, వెండి ఒక కిలో 20 గ్రాములు, నిత్య అన్నదానం హుండీ ద్వారా 1,43,720 రూపాయలు, ఫారిన్ కరెన్సీ యూఎస్ఏ డాలర్స్ 364, కెనడా డాలర్స్ 20, ఇంగ్లాండ్ పౌండ్స్ 10, యూఏఈ దిరమ్స్ 70, సింగపూర్ డాలర్స్ 52, మలేషియా రింగ్ ఇట్స్ 1 ఆదాయం వచ్చినట్లు కాణిపాకం దేవస్థానం ఈవో పెంచల కిషోర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ మణి నాయుడు, ట్రస్ట్ బోర్డ్ మెంబర్ నాగరాజు నాయుడు, డిఇఓ సాగర్ బాబు, చిత్తూరు అసిస్టెంట్ కమిషనర్ చిట్టెమ్మ, ఏ ఈ ఓ లు ఎస్. వి. కృష్ణారెడ్డి, హరి మాధవరెడ్డి, ప్రసాద్, ధనంజయ, పర్యవేక్షకులు కోదండపాణి, శ్రీధర్ బాబు, బాల రంగస్వామి, దేవస్థానం సిబ్బంది, సేవకులు, యూనియన్ బ్యాంక్ కాణిపాకం శాఖ, తదితరులు పాల్గొన్నారు

# పశు వైద్య శిబిరం మేలు జాతి దూడల ప్రదర్శన

**52 గేదెలకు చికిత్స, 30 దూడలకు నట్టల నివారణ మందుల పంపిణీ**

**జేడీ డాక్టర్ జి,వి రమేష్**



**మాడ్గులపల్లి:**
మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో శుక్రవారం పశుసంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పశు వైద్య శిబిరం మేలు జాతి దూడల ప్రదర్శనను అత్యంత ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పశుసంవర్ధక శాఖ నల్గొండ జేడీ డాక్టర్ జి.వి. రమేష్, ఏడీ డాక్టర్ జె. వెంకట్ రెడ్డి, మాడ్గులపల్లి గ్రామ సర్పంచ్ ఆరూరి నరేష్, ఉప సర్పంచ్ మల్లెపల్లి వెంకన్నలు హాజరయ్యారు ఈ సందర్భంగా జేడీ రమేష్ మాట్లాడుతూ పాడి రైతులు పశువుల ఆరోగ్యంపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వం కల్పిస్తున్న ఇటువంటి వైద్య సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు వైద్య శిబిరంలో భాగంగా సుమారు 52 గేదెలకు వివిధ రకాల వ్యాధులను గుర్తించి, వాటికి ఉచితంగా మందులు పంపిణీ చేసి చికిత్స అందించారు అనంతరం నిర్వహించిన మేలు జాతి దూడల ప్రదర్శనలో 30 దూడలను ప్రదర్శించారు వీటికి నట్టల నివారణ మందులను వేయడంతో పాటు, వాటి పోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులకు రైతులకు వివరించారు ఈ కార్యక్రమంలో మాడుగులపల్లి మండల పశువైద్యాధికారి డాక్టర్ వినయ్ కుమార్, పాములపాడు పశువైద్యాధికారి డాక్టర్ విక్రమ్ రెడ్డి, గోపాలమిత్ర సూపర్వైజర్ శ్రీనివాస్, గోపాలమిత్రలు శోభన్ రెడ్డి, నరేందర్, సిబ్బంది శ్రీలత, జయమ్మ, మెహబూబ్, వ్యాక్సినేటర్లు వినోద్, రాకేష్ రైతులు మల్లారెడ్డి, ఆవుల బుచ్చయ్య, కర్ణం రమేష్, కట్టా ముక్తా రెడ్డి, బచ్చి రెడ్డి, ఉరిబిండి రాములు, నాగరాజు, ప్రభాకర్, కాలగోని బాలయ్య, సైదులు, ఏర్పుల నాగరాజు మండలంలోని



పాడి రైతులు పాల్గొన్నారు.

# సుజాతనగర్ కొనుగోలు కేంద్రంలో తడిసిన వడ్లు....

- ప్రభుత్వ నిర్లక్ష్యంపై రైతుల ఆగ్రహం...
- ప్రతి గింజను కొనాలి రైతును ఆదుకోవాలి...
- సీపీఎం జిల్లా కమిటీ సభ్యుల నల్ల గోపు పుల్లయ్య....



**సుజాతనగర్ :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్లోని వడ్ల కొనుగోలు కేంద్రంలో అకాల వర్షాలు రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేశాయి. గత రెండు రోజులుగా కురుస్తున్న నిరంతర వర్షాలకు కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉంచిన వడ్లు పూర్తిగా తడిసి ముద్దయ్యాయి. చేతికొచ్చిన పంటను అమ్మి అప్పులు తీర్చుకుని కుటుంబాన్ని గట్టెక్కిద్దామని ఆశించిన రైతులకు ప్రకృతి మరోసారి భారీ దెబ్బ కొట్టింది. తడిసిపోయిన వడ్లను చూసి రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఆరు కాలాలు కష్టపడి చెమటోడ్చి పండించిన పంట చివరి దశలో ఇలా నష్టపోవడం చాలా బాధాకరమని రైతులు వాపోతున్నారు. వడ్లు కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చిన తర్వాత ప్రభుత్వం, సంబంధిత అధికారులు సరైన రక్షణ చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆరోపిస్తున్నారు. కేంద్రాల్లో తగిన షెడ్లు, టార్పాలిన్లు, నీరు చొరబడకుండా జాగ్రత్తలు ఉంటే వడ్లు ఈ స్థాయిలో తడిసేవి కావని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం కారణంగా తడిసిన వడ్లను నాణ్యత పేరుతో తిరస్కరిస్తారేమోనన్న భయంతో రైతులు మరింత కలవరపడుతున్నారు. ఇప్పటికే పెట్టుబడులు, ఎరువులు, కూలీల ఖర్చులతో అప్పుల్లో కూరుకుపోయిన రైతుకు ఈ పరిస్థితి మరింత భారంగా మారిందని గ్రామస్తులు చెబుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తడిసిన వడ్లను ప్రత్యేక నిబంధనలతో కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మాట్లాడుతూ రైతు పండించిన ప్రతి గింజకు ప్రభుత్వం హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు పంటను కాపాడటంలో ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. వాతావరణ హెచ్చరికలు ఉన్నప్పటికీ కొనుగోలు కేంద్రాల్లో ముందస్తు చర్యలు తీసుకోకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం ప్రకటించాలని, తడిసిన వడ్లను మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, రైతులను అప్పుల బారిన పడకుండా ఆదుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. రైతు బతికితేనే దేశం బతుకుతుందని, రైతు సమస్యలను రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వం అత్యవసరంగా పరిష్కరించాలని వారు కోరారు. సుజాతనగర్ కొనుగోలు కేంద్రంలో తడిసిన వడ్లను చూపిస్తూ రైతులు వ్యక్తం చేస్తున్న ఆవేదన ప్రస్తుతం అక్కడి పరిస్థితుల తీవ్రతను



స్పష్టంగా తెలియజేస్తోంది. రైతు చెమటకు విలువ ఇచ్చే విధంగా ప్రభుత్వం వెంటనే స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బంది కలగవద్దు జేసీ

**మాడుగులపల్లి పీఏసీఎస్ కేంద్రం తనిఖీ**

**రికార్డులు,సీరియల్ బుక్కుల పరిశీలన**

**జేసీ శ్రీనివాస్**




**మాడుగులపల్లి:**
మండల కేంద్రంలోని వేములపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా ఆయన కేంద్రంలోని రికార్డులను, సీరియల్ బుక్కులను క్షుణ్ణంగా పరిశీలించి, కొనుగోలు ప్రక్రియ తీరును అడిగి తెలుసుకున్నారు,అనంతరం జేసీ మాట్లాడుతూ కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చే రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు,సీరియల్ క్రమం పాటిస్తూ పారదర్శకంగా కొనుగోళ్లు జరపాలని, తూకంలో తేడాలు రాకుండా జాగ్రత్త వహించాలని సూచించారు వాతావరణ మార్పుల దృష్ట్యా కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు రైతులకు చెల్లింపుల విషయంలో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని స్పష్టం చేశారు,ఈ తనిఖీ కార్యక్రమంలో జేసీ వెంట తాసిల్దార్ సరోజ పావని,జిపిఓ పెదమం శ్రీనివాస్ స్థానిక రెవెన్యూ అధికారులు, పీఏసీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co